www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
10 సెప్టెంబర్ 2023
సంపుటి:1 సంచిక:333

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



గ్రాండ్‌గా వాసవి సరోవర్ వేడుక

8




## 'న్యూ ఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదం

### జీ20 శిఖరాగ్ర సమావేశాల్లో భారత్ కు భారీ విజయం

- G20 నాయకులందరూ స్వీకరించాలని ప్రధాని మోదీ పిలుపు
- తొలిరోజున.. పలు కీలక అంశాలపై కొనసాగిన చర్చలు
- ఆఫ్రికన్ యూనియన్ సభ్యత్వానికి ఆమోదం
- పలు సభ్యదేశాలతో భారత్ ద్వైపాక్షిక చర్చలు
- ప్రపంచ జీవఇంధన కూటమి ప్రారంభిస్తున్నట్లు ప్రధాని ప్రకటన
- ప్రపంచ అగ్రనేతలకు భారతీయ వంటకాలను రుచి చూపించిన రాష్ట్రపతి
- 'జీ20' కోసం దిల్లీ మురికివాడలను కూల్చివేయడంపై ప్రధానిపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,విశాలభారతి:**

భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న జీ20 సదస్సు తొలిరోజున.. సభ్యదేశాలు పలు కీలక అంశాలపై చర్చించాయి. 'దిల్లీ డిక్లరేషన్'పై (Delhi Declaration) ఏకాభిప్రాయం రావడంతోపాటు ఆఫ్రికన్ యూనియన్ సభ్యత్వానికి ఆమోదం వంటి అనేక విషయాలపై స్పష్టత వచ్చింది. ఇదే సమయంలో పలు సభ్యదేశాలతో భారత్ ద్వైపాక్షిక చర్చలు జరిపింది.

**తొలిరోజు హైలైట్స్**

ఆఫ్రికన్ యూనియన్ కు సభ్యత్వం: 55 దేశాలు సభ్యులుగా ఉన్న ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు సభ్యదేశాలు అంగీకరించినట్లు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. కీలకమైన ఆఫ్రికన్ యూనియన్‌ను కూటమిలో చేర్చడాన్ని భారత్ ప్రతిపాదించగా.. అందుకు సభ్యదేశాలు ఆమోదం తెలిపాయి.

**ప్రపంచ జీవఇంధన కూటమి**

ప్రపంచ జీవ ఇంధన కూటమిని ప్రారంభిస్తున్నట్లు భారత్ ప్రకటించింది. పెట్రోల్లో 20 శాతం ఇథనాల్ కలిపేలా చొరవ తీసుకోవాలని పిలుపునిస్తూ.. ప్రపంచ జీవ ఇంధన కూటమిని ఏర్పాటు చేస్తున్నట్టు మోదీ ప్రకటించారు. జీవ ఇంధనాల విషయంలో అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయడం తక్షణ అవసరం ఉందని అన్నారు. క్లీన్ ఫ్యూయల్‌ని ప్రోత్సాహించేందుకు..

..మిగతా | 2 | లో

"ఢిల్లీ వేదికగా శనివారం జీ20 శిఖరాగ్ర సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఈ సమ్మిట్ 'న్యూ ఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదం తెలిపింది. ఇది భారతదేశానికి భారీ విజయంగా నేతలు అభివర్ణించారు. అయితే.. ఉక్రెయిన్‌లో యుద్ధం, వాతావరణ మార్పులను పరిష్కరించడంలో భిన్నాభిప్రాయాల కారణంగా న్యూ ఢిల్లీ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం పొందేందుకు కొంచెం ఆలస్యం అయ్యింది. ఏదైమైనా.. దీనిపై ఏకాభిప్రాయం రావడంతో ప్రధాని మోదీ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. 'ఒక గుడ్ న్యూస్ ఉంది. మా బృందం కృషి, ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరి మద్దతుతో న్యూ ఢిల్లీ జీ20 లీడర్ల సమ్మిట్ డిక్లరేషన్ ఏకాభిప్రాయానికి చేరుకుంది' అని ప్రధాని మోదీ చెప్పారు. దీనిని G20 నాయకులందరూ స్వీకరించాలని, ఇది జరుగుతుందని తాను ఆశిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు.

**దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం**

జీ20 తీర్మానానికి సభ్యదేశాలన్నీ అంగీకరించినట్లు భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఉక్రెయిన్ సంక్షోభంపై భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతోన్న తరుణంలో భారత అధ్యక్షతన జరిగిన సదస్సులో 'దిల్లీ డిక్లరేషన్'పై సభ్యదేశాలు ఏకతాటిపైకి రావడం భారత్ సాధించిన చారిత్రక విజయమని ప్రభుత్వం భావిస్తోంది.



## చంద్రబాబు అరెస్ట్

### స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అదుపులోకి..

- నంద్యాలలో అరెస్ట్ చేసిన ఏపీ సీఐడీ
- అత్యంత నాటకీయ పరిణామాల నేపథ్యంలో కస్టడీలోకి..
- తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం
- పలు చోట్ల విధ్వంసం
- నంద్యాల నుంచి విజయవాడ తీసుకొచ్చిన పోలీసులు
- సిట్ కార్యాలయంలో ఎంక్వైరీ..
- మాజీ సీఎంను ప్రశ్నించిన అధికారులు
- నోరువిప్పని బాబు?
- అత్యంత కఠిన సెక్షన్ల కింద కేసులు
- అరెస్టును ఖండించిన నేతలు

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా నేడు

**టీడీపీ ఆందోళనలు**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ 2

**విశాలభారతి, ఏపీ బ్యూరో:**

తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని నేత, దశాబ్ధాల పాటు రాజకీయాలను శాసించిన నేత, అన్ని వ్యవస్థలను మేనేజ్ చేయగలడు అన్న పేరు తెచ్చుకున్న నేత అంతటి బలమైన నేత చంద్రబాబును సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెయిల్ దొరకని విధంగా సెక్షన్లు కట్టి చంద్రబాబును అరెస్ట్ చేశారు. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును పక్కా ఆధారాలతో ఏపీ సీఐడీ పోలీసులు కార్నర్ చేసినట్టు తెలుస్తోంది. ముందస్తు బెయిల్ తెచ్చుకొనే అవకాశం లేకుండా చంద్రబాబు మీద పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చంద్రబాబు పై 120(బి), 166, 167,418, 420, 465, 468, 201, 109, రీడ్‌విత్ 34 and 37 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు కట్టారు. నంద్యాలలోని ఓ పంక్షన్ హాల్ లో ఉన్న చంద్రబాబును శనివారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి

..మిగతా | 2 | లో



## మొరాకోలో భూకంపం..

### 632కు చేరిన మృతుల సంఖ్య

**-విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

ఆఫ్రికా దేశమైన మొరాకో భూకంపం ధాటికి వణికిపోయింది. శుక్రవారం అర్ధ రాత్రి రిక్టర్ స్కేల్పై 6.8గా భూకంప తీవ్రత నమోదైంది. మొరాకో ప్రభుత్వం వెల్లడించిన రిపోర్టు ప్రకారం శనివారం మధ్యాహ్నం నాటికి ఈ ఘటనలో మృతుల సంఖ్య 632 మందికి చేరింది. అల్ హౌజ్, మ్రాకేశ్, క్వార్జాజేట్, అజిలాల్ సహా పలు ప్రాంతాల్లో ఈ మరణాలు సంభవించాయి. మరో 300 మందికి పైగా గాయపడ్డారని ప్రభుత్వం వెల్లడించింది. 'అకస్మాత్తుగా భూమి కంపించడంతో భవనాలు కదిలిపోవడం కనిపించింది. దాంతో ప్రజలు కేకలు వేసుకుంటూ బయటకు

..మిగతా | 2 | లో

## టెట్ హాల్ టికెట్లు విడుదల

- ఈ నెల 15న పరీక్ష

**హైదరాబాద్,విశాలభారతి:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్ టికెట్లు విడుదలయ్యాయి. tstet.cgg.gov.inలో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు

..మిగతా | 2 | లో

TS-TET 2023
TELANGANA STATE TEACHER ELIGIBILITY TEST

## ఆ ప్రాజెక్టు తెలంగాణ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుంది

- లక్షల ఎకరాలకు సాగునీరు అందించే స్థాయి ప్రాజెక్టు ప్రారంభోత్సవం
- ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల కల
- ఇంత గొప్ప సందర్భాన్ని గొప్పగా నిర్వహించాలి:- మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,విశాలభారతి:**

వలసల జిల్లాలో ఒకనాడు అభివృద్ధికి నోచుకోని పాలమూరు జిల్లాను నేడు సీఎం కేసీఆర్ పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుతో పచ్చగా చేస్తున్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం నాడు ఈనెల 16వ తేదీన జరిగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర సచివాలయంలో మంత్రి కేటీఆర్ సమీక్షించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, వివిధ శాఖల అధిపతులు, పూర్వ జిల్లా కలెక్టర్లు హాజరైయ్యారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర విభాగాల అధిపతులతో మంత్రులు కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..'ప్రతి ఏటా లక్షల మంది పాలమూరు ప్రజలు వలస పోయే పరిస్థితి ఉండేది. కానీ నేడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే స్థాయి ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేసుకుంటున్నాం. పాలమూరుతో పాటు రంగారెడ్డి జిల్లా భూములకు కూడా ఈ ప్రాజెక్ట్ నీళ్లు అందిస్తుంది. గోదావరిలో కాళేశ్వరం, కృష్ణాలో పాలమూరురంగారెడ్డి లాంటి గొప్ప ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం కట్టింది. సీతారామ ప్రాజెక్టు కూడా పూర్తి అయితే తెలంగాణ సాగునీటి రంగంలో ప్రాజెక్టులతో జలకళను సంతరించుకుని పంటలు పండుతాయి. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ నాయకత్వంలో కట్టిన ప్రాజెక్టులను చూసి కేవలం తెలంగాణ బిడ్డగానే కాకుండా భారత దేశ పౌరుడిగా

..మిగతా | 2 | లో



కాంగ్రెస్ ను ఎదుర్కొనేందుకు

## బీజేపీ, బీఆర్ఎస్ కలిశాయి

- కార్యకర్తలే కాంగ్రెస్ కు కీలకం
- పీసీసీ అధ్యక్షుడిని కావడంతో నా జన్మధన్యం
- రేవంత్ రెడ్డి కామెంట్స్

2





## విమోచన దినోత్సవం అధికారికంగా జరపాల్సిందే

- పోరాటం చేసే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- మజ్లిస్ పార్టీని సంతృప్తి పరిచేందుకే కేసీఆర్ ఉత్సవాలు జరపడం లేదు
- కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాలను తప్పుదోవపట్టించే ప్రయత్నం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

2

# చంద్రబాబు అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

తీసుకున్నారు. టీడీపీ శ్రేణులు అడ్డుపడ్డా, కార్యకర్తలు ఎదురుతిరిగినా పోలీసులు చంద్రబాబును అరెస్ట్ చేసి.. విజయవాడకు తరలించారు. అనంతరం అక్కడ సిట్ కార్యాలయంలో చంద్రబాబును విచారిస్తున్నారు.

**కలిసేందుకు నో పర్మిషన్**

చంద్రబాబును కలిసేందుకు ఆయన కుటుంబసభ్యులను సిట్ కార్యాలయం లోకి అనుమతించారు.చంద్రబాబును చూసేందుకు భార్య భువనేశ్వరి, తనయుడు లోకేష్, మరికొందరు కుటుంబ సభ్యులను సిట్ ఆఫీసులోకి పంపించారు. నేటి ఉదయం నుంచి చంద్రబాబును కలిసేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ అధినేతను కలిసేందుకు చంద్రబాబు కుటుంబసభ్యులను సిట్ కార్యాలయంలోకి అధికారులు అనుతించారు. కానీ చంద్రబాబు వద్దకు కుటుంబసభ్యులను తీసుకెళ్లలేదు. చంద్రబాబు కుటుంబసభ్యులను అధికారులు 4వ అంతస్తులో కూర్చోబెట్టారు. చంద్రబాబు 5వ అంతస్తులో విచారణ ఎదుర్కొంటున్నట్లు సమాచారం. తన తరపున అడ్వకేట్లను అయినా లోపలకి అనుమతించాలని సీఐడీ అధికారులకు చంద్రబాబు లేఖ రాశారు. తన లాయర్లు దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మీ నారాయణ, శరత్ చంద్రలను కలిసేందుకు అనుమతించాలని లేఖలో చంద్రబాబు కోరారు. మరోవైపు బాలకృష్ణ, బ్రాహ్మణి హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరారు. నేటి ఉదయం స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ కేసులో అవినీతి ఆరోపణలతో చంద్రబాబు నాయుడును పోలీసులు నంద్యాలలో అరెస్ట్ చేశారు. సాయంత్రానికి తాడేపల్లి లోని కుంచనపల్లి సీఐడీ సిట్ కార్యాలయానికి చంద్రబాబును తరలించారు. ఉద్దేశపూర్వకంగానే ఏపీ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్ చేసిందని బాలయ్య ఆరోపించారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేకున్నా చంద్రబాబును అరెస్ట్ చేశారని, స్కిల్ డెవలప్ మెంట్ విషయంలో కోర్టు ఏపీ సర్కారుకు చీవాట్లు పెట్టిందని గుర్తుచేశారు. తాను ఎలాగూ జైల్లో ఉన్నానని, చంద్రబాబును సైతం జైల్లో పెట్టాలని జగన్ తాపత్రయం అని, ఛార్జిషీటు లేకున్నా, కేసులో పేరు లేకున్నా కక్ష సాధింపు ధోరణితో టీడీపీ అధినేతను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారని బాలకృష్ణ ఆరోపించారు.

**సిట్ కార్యాలయంలోనే చంద్రబాబు**

చంద్రబాబు దాదాపు 3గంటలుగా సిట్ కార్యాలయంలోనే ఉన్నారు. నంద్యాల నుంచి రోడ్డు మార్గంలో సాయంత్రం 5గంటలకు కుంచనపల్లిలోని సిట్ కార్యాలయానికి చంద్రబాబును తీసుకొచ్చారు. అప్పటి నుంచి చంద్రబాబును.. ఆయన తరపు న్యాయవాదులను కూడా కలవనీయకుండా సీఐడీ అధికారులు అడ్డుకున్నారు. న్యాయసహాయం కోసం లాయర్లను కలిసేందుకు అనుమతివ్వాలని చంద్రబాబు స్వయంగా లేఖ రాసినా సీఐడీ అధికారులు స్పందించలేదు. మరోవైపు భువనేశ్వరి, నారా లోకేశ్‌ను కూడా చంద్రబాబును కలిసేందుకు సీఐడీ అధికారులు అనుమతించలేదు. చంద్రబాబు సిట్ కార్యాలయంలోని ఐదో అంతస్తులో ఉంటే వీరిని నాలుగో అంతస్తులో కూర్చోబెట్టారు.

## చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా
# నేడు టీడీపీ ఆందోళనలు

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్**



**విశాలభారతి, హైదరాబాద్:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం చర్యలకు నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో టీడీపీ లీడర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## 'న్యూ ఢిల్లీ డిక్లరేషన్'కు
# ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్లో 20 శాతం వరకు ఇథనాల్ మిశ్రమాన్ని కలపాలని తాము ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

**G20శాటిలైట్ మిషన్ ప్రతిపాదన**

వాతావరణం, పర్యావరణ పరిశీలన కోసం ప్రత్యేకంగా 'జీ20 శాటిలైట్ మిషన్'ను భారత్ ప్రతిపాదించింది. ఇందుకోసం భారత్ చేపట్టిన 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కార్యక్రమంపై నేతలు పని చేయడం ప్రారంభించాలని కోరారు.

**బ్రిటన్ ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు**

జీ20 సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పెట్టుబడులకు ఊతమివ్వడం, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు చర్చించారు. సమావేశం అనంతరం మాట్లాడిన మోదీ.. సంపన్న, సుస్థిర ప్రపంచం కోసం భారత్, బ్రిటన్‌లు కలిసి పనిచేస్తూనే ఉంటాయని అన్నారు.

**జపాన్ ప్రధానితో మోదీ భేటీ**

జీ20 సదస్సు నేపథ్యంలో అటు జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదాతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించామని.. అనుసంధానం, వాణిజ్యంతోపాటు ఇతర రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని ఇరునేతలు చెప్పారు.

**అతిథులకు రాష్ట్రపతి ప్రత్యేక విందు**

20 శిఖరాగ్ర సదస్సు లో పాల్గొనేందుకు దిల్లీకి చేరుకున్న దేశాధినేతలు, ఇతర అతిథులకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. విందులో భాగంగా ప్రపంచ అగ్రనేతలకు భారతీయ వంటకాలను రుచి చూపించారు. విందులో భాగంగా అతిథులకు బంగారం, వెండి పాత్రల్లో విందు వడ్డించారు. చిరుధాన్యాలు, పనసపండుతో చేసిన గాలెట్టె (బ్రెడ్ వంటి ఫ్రెంచి వంటకం), గ్లేజ్‌డ్ ఫారెస్ట్ మష్రూమ్, చిరుధాన్యాల వంటకాలు, కేరళ రెడ్‌రైస్, వివిధ రకాల బ్రెడ్‌లతో పాటు ముంబయి పావ్ కూడా అందించారు. డెజర్ట్‌లో యాలకులు, ఊదలతో చేసిన మధురిమ అనే పుడ్డింగ్, ఫిగ్ పీచ్ కంపోట్, ఆంబేమొహార్ క్రిస్పీస్, పాలుగోధుమలతో చేసిన నట్స్ ఏర్పాటు చేశాయి. పానీయాల్లో కశ్మీరీ ఖావా, ఫిల్టర్ కాఫీ, డార్జిలింగ్ టీ, పాన్ ఫ్లేవర్డ్ చాక్లెట్ అందించారు..

**వాస్తవాలను ప్రధాని దాచి పెట్టారు: రాహుల్ గాంధీ**

జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు సుందరీకరణ పనుల్లో భాగంగా దిల్లీ లోని మురికివాడలను కూల్చివేసి, అక్కడి ప్రజలను తరలించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్రంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచ నేతల ముందు వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ''మన పేద ప్రజలను, జంతువులను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతోంది. జీ20 సదస్సు కోసం మన దేశానికి విచ్చేసిన అతిథుల నుంచి వాస్తవాలను దాచిపెట్టాల్సిన అవసరం లేదు'' అని ఎక్స్ (ట్విటర్)లో రాసుకొచ్చారు.

# కాంగ్రెస్ ను ఎదుర్కొనేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిశాయి

**విశాలభారతి, హైదరాబాద్:**



కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేసున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..''202324 ఎన్నికల్లో ఈ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలంటే క్షేత్ర స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ నియామకం జరగాలి. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించేది బూత్ లెవెల్ ఏజెంట్.కాంగ్రెస్ జెండాను మోసే నిఖార్సైన కార్యకర్తలను బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమించుకుందాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో 43 లక్షల డిజిటల్ మెంబర్షిప్ చేసుకున్నాం.90లక్షల ఓట్లు తెచ్చుకుంటే రాష్ట్రంలో 90 సీట్లు గెలుస్తాం.వంద రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేటాయించాలి. అయ్యప్ప, శివ మాలధారణలా కాంగ్రెస్ దీక్ష తీసుకుని, సోనియమ్మ మాల వేసుకుని కష్టపడాలి. కేసీఆర్ లక్ష కోట్లు దోచుకున్నారు.రజాకర్లు కూడా ఇంత దోపిడీ, విధ్వంసానికి పాల్పడలేదు. తెలంగాణలో సీడబ్ల్యూసీ సమావేశాలు జరగడం ఈ గడ్డకు దక్కిన గౌరవం. ఇక్కడ సమావేశాలు జరగడం పీసీసీ అధ్యక్షుడిగా నా జన్మ ధన్యం. వక్ఫ్ భూమిలో నాంపల్లి విజయ నగర్ కాలనీలో ఎంఐఎంకు అనుమతి ఇచ్చారు. మరి తుక్కుగూడలో కాంగ్రెస్ సభకు ఎందుకు ఇవ్వరు?.దేవుడి భూమి అనే సాకుతో అనుమతి నిరాకరించినా ఆ దేవుడే మనకు దారి చూపారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విజయభేరీ సభ కోసం వంద ఎకరాలు ఇచ్చారు.ధర్మమే కాంగ్రెస్'ను గెలిపిస్తుంది. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'' వస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## తప్పు నేనే చేశాను..క్షమాపణలు కాదు
# కాళ్లే మొక్కుతా

- **తప్పు నేనే చేశాను..క్షమాపణలు కాదు కాళ్లే మొక్కుతా**
- **లోక్ అదాలత్లో ఆలుమగల కొట్లాట సుఖాంతం**
- **జోగులాంబ గద్వాల జిల్లాలో హృదయాలను కదిలించే సంఘటన**

**గద్వాల్ ,విశాలభారతి:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్లో హృదయాలను కదిలించే సంఘటన చోటుచేసుకుంది. గద్వాల పట్టణం సుంకులమ్మ మెట్టుకు చెందిన డ్రైవర్ గోవిందుకు.. రాజేశ్వరి అనే మహిళతో 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. గోవిందు తాగిన మైకంలో...తరచూ తన భార్యతో గొడవపడి చేయి చేసుకునేవాడు. విసిగిపోయిన రాజేశ్వరి చివరకు గద్వాల పట్టణ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసింది. వీరి సమస్య కొన్ని రోజులు తరువాత రాజీ కొరకు జాతీయ లోక్‌అదాలత్కు చేరింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుషాతో పాటు.. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి రోజ్ క్రిస్టియన్ , సీనియర్ సివిల్ జడ్జి గంటా కవిత, జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్ల సమక్షంలో జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో కౌన్సెలింగ్ ఇచ్చి.. ఈ దంపతులను కలిపారు. అనంతరం ఇద్దరూ దండలు మార్చుకొనేలా చేశారు. గోవిందు భావోద్వేగానికి గురవుతూ.. తాగిన మైకంలో తన భార్యను కొడుతుండడం పొరపాటేనని నిజాయితీగా ఒప్పుకున్నాడు. దీనితో న్యాయమూర్తులు ఆమెకు క్షమాపణ చెప్పాలని కోరగా సారీ కాదు.. కాళ్లే మొక్కుతానని తన భార్య కాళ్లను మొక్కాడు. వాస్తవంగా చెప్పాలంటే తన తల్లిదండ్రులకు మించి తన భార్య తనను చూసుకుంటుందని ఇక ముందు అలా చేయనని గోవిందు చెప్పాడు. ఈ దృశ్యాలతో లోక్ అదాలత్ ఒక్కసారిగా చప్పట్లతో మారుమోగిపోయింది

# చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

**- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్,విశాలభారతి:** టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన తుమ్మల.. చంద్రబాబు అరెస్టును ఖండించారు. అసత్యాలతో ఆయన ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర చేశారని ఆరోపించారు. చంద్రబాబు పట్ల రాజకీయ కక్షతో దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. న్యాయసూత్రాలు పాటించకుండా మాజీ సీఎం పట్ల అమర్యాదగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో శనివారం తెల్లవారు జామున నంద్యాల్లో చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నంద్యాల నుంచి రోడ్డు మార్గంలో చంద్రబాబును తాడేపల్లిలోని సిట్‌కార్యాలయానికి తరలించారు.

# టెట్ హాల్ టికెట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. సెప్టెంబరు 9 నుంచి 14వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. డౌన్‌లోడ్‌లో సమస్యలు ఎదురైతే హెల్ప్ డెస్క్ 04023120340, 04023120433 నంబర్లను సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబరు 15న టెట్ పరీక్ష జరగనుందని అధికారులు తెలిపారు. పేపర్1 ఉదయం 9:00 గంటల నుంచి 12:00 గంటల వరకు, పేపర్2 మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఫలితాలు సెప్టెంబరు 27న విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

# మొరాకోలో భూకంపం..

మొదటిపేజీ తరువాయి

పరుగులు తీశారు. అప్పుడే సరిగ్గా విద్యుత్తు నిలిచిపోయింది. పది నిమిషాల పాటు మేం అంధకారంలో ఉండిపోయాం. ఏ నెట్‌వర్క్ పనిచేయలేదు' అని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారితో సమీప ఆసుపత్రులు నిండిపోయాయి. శతాబ్దకాలంలో ఉత్తరాఫ్రికా ఈ స్థాయి భూకంపాన్ని చూడలేదని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. మర్రాకేశ్ నగరానికి నైరుతి దిశగా 71 కిలోమీటర్లు దూరంలో ఈ భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపింది. భూకంప కేంద్రం భూమి కింద 18.5 కి.మీ లోతులో ఉన్నట్లు పేర్కొంది.ఈ విపత్తు సృష్టించిన విధ్వంసానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి. మర్రాకేశ్ నగరంలో పలు ఇండ్లు కూలిపోయాయి. రెస్క్యూ టీమ్ ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తోంది.

## విమోచన దినోత్సవం
# అధికారికంగా జరపాల్సిందే

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలంటూ పోరాటం చేసే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత విమోచన ఉత్సవాలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మజ్లిస్ పార్టీని సంతృప్తి పరిచేందుకే కేసీఆర్.. విమోచన ఉత్సవాలు జరపడం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన ఉత్సవాలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంగా విమోచన ఉత్సవాలు చేయడం లేదని ఆరోపించారు. నిజాం అరాచక పాలను నుంచి అప్పటి హైదరాబాద్ సంస్థానం విమోచన సందర్భంగా సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరవేశారని వివరించారు. చరిత్రలో జరిగిన ప్రతి ఘట్టానికి పండగ వాతావరణంతో జరుపుకోవడం ఆనవాయతీ అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గత 75 సంవత్సరాలుగా రాజీపడే ప్రసక్తే చేయకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాలు చేయాలని గత 25 సంవత్సరాలుగా రాష్ట్రంలో బీజేపీ పోరాడుతుందని తెలిపారు. విమోచన దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి టీఆర్ఎస్ పార్టీ.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విమోచన ఉత్సవాలు చేయాలని డిమాండ్ చేసిందని అన్నారు.

# హస్తం దూకుడు..ఎన్నికల కోసం 8 కమిటీలు

- **శ్రీధర్ బాబు నేతృత్వంలో మేనిఫెస్టో కమిటీ**



**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం 8 కమిటీలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ కోసం పార్టీని సన్నద్ధం చేయడమే కాకుండా.. గెలిపించే బాధ్యతలను ఈ కమిటీలపై పెట్టింది. మొత్తం 8 కమిటీలకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కమిటీల లిస్టును విడుదల చేశారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీకి దామోదర రాజనర్సింహను చైర్మన్‌గా నియమించారు. ఆయనతో కలిపి ఈ కమిటీలో 9 మంది సభ్యులు ఉన్నారు. ఇక మేనిఫెస్టో కమిటీకి దుద్దిళ్ల శ్రీదర్ బాబును చైర్మన్‌గా, గడ్డం ప్రసాద్‌ను వైస్ చైర్మన్‌గా నియమించారు. మేనిఫెస్టో కమిటీలో 24 మంది సభ్యులు ఉండగా.. పీసీసీ ప్రెసిడెంట్, సీఎల్పీ లీడర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఆర్గనైజేషన్స్, ఐఎన్‌టీయూసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్స్ బాధ్యులను ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమించారు. ఏఐసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీకి చైర్మన్‌గా బలరామ్ నాయక్‌ను నియమించారు. ఈ కమిటీలో మొత్తం 10 మంది సభ్యులు ఉన్నారు. ఇక పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా షబ్బీర్ అలీని, వైస్ చైర్మన్‌గా ఈ.అనిల్ కుమార్‌ను నియమించారు. వీరిద్దరితో కలిపి ఈ కమిటీలో 12 మంది సభ్యులు ఉన్నారు. చార్జ్‌షీట్ కమిటీకి చైర్మన్‌గా సంపత్ కుమార్, వైస్ చైర్మన్‌గా రాములు నాయక్‌ను నియమించారు. ఈ కమిటీలో మొత్తం 14 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధులందరూ ఈ కమిటీలో భాగస్వామ్యులు కానున్నారు. m`bకమ్యునికేషన్ కమిటీకి చైర్మన్‌గా జెట్టి కుసుమ్ కుమార్‌ను, వైస్ చైర్మన్‌గా మదన్ మోహన్ రావును నియమించారు. ఇందులో మొత్తం 9 మంది సభ్యులు ఉన్నారు. ట్రైనింగ్ కమిటీకి చైర్మన్‌గా పొన్నం ప్రభాకర్, కన్వీనర్‌గా పవన్ మల్లాదిని నియమించారు.

# ఒకే రోజు 1603 అప్లికేషన్లు..

- **బీజేపీ అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కోసం దరఖాస్తులు వెల్లువ**




**హైదరాబాద్,విశాలభారతి:** బీజేపీ అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కోసం దరఖాస్తు గడువు సెప్టెంబర్ 10తో లాస్ట్ డేట్ కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి.అనుచరులతో నాయకులు తరలి వస్తుండటంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. సెప్టెంబర్ 9న 1603 అప్లికేషన్లు వచ్చాయి. ఇప్పటి వరకు మొత్తం 3223 దరఖాస్తులు వచ్చాయి. సెప్టెంబర్ 10 ఏకాదశి, పునర్వసు నక్షత్రం ఉండటంతో ఎక్కువ దరఖాస్తులు వస్తాయని తెలుస్తోంది. ఇవాళ శనివారం కారణంగా పలువురు ముఖ్య నేతలు అప్లికేషన్లు పెట్టలేదని సమాచారం. భువనగిరి నుంచి సీనియర్ నాయకులు గూడురు నారాయణ రెడ్డి, షాద్ నగర్ నుంచి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు దరఖాస్తు చేసుకున్నారు. కంటోన్మెంట్ టికెట్ కోసం మాజీమంత్రి శంకర్ రావు కూతురు సుస్మిత దరఖాస్తు చేసుకున్నారు. నారాయణఖేడ్ నుంచి సంగప్ప, పరిగి నుంచి మారుతికిరణ్, నర్సాపూర్ నుంచి గోపి, జనగామ నుంచి ఓయూ జేఏసీ నేత సంతోష్ ముదిరాజ్ దరఖాస్తు చేసుకున్నారు.

## ఆ ప్రాజెక్టు తెలంగాణ చరిత్రలో
# మైలురాయిగా నిలిచిపోతుంది

మొదటిపేజీ తరువాయి

కూడా గర్వంగా ఉంటుంది.ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల కల. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ ఆలోచనల మేరకు రూపుదిద్దుకున్న గొప్ప ప్రాజెక్టు ఇది. పాలమూరు రంగారెడ్డి ప్రజలు పడిన కష్టాలను తీర్చే గొప్ప ప్రాజెక్టు ఇది. చాలా అడ్డంకులను దాటుకుని కేసీఆర్ పట్టుదలతో పూర్తయిన ప్రాజెక్టు ఇది. రైతుల పొలాలకు సాగునీటితో పాటు, రాజధాని ప్రజల తాగునీటి అవసరాలు, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాను కూడా ఈ ప్రాజెక్టు అందిస్తుంది. 16వ తేదీన జరిగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవం తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఇంత గొప్ప సందర్భాన్ని గొప్పగా నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. ఈ ప్రాజెక్టు విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా గొప్పగా సంబరాలు చేసుకోవాలి. కనీసం లక్షన్నర మంది రైతులతో ప్రారంభోత్సవం సభ ఉంటుంది' అని మంత్రి కేటీఆర్ తెలిపారు.



## 'సేవాలాల్‌సేన' ఆవిర్భావ దినోత్సవాన్ని సక్సెస్‌చేయాలి

**జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్**

**జనగామ, విశాల భారతి :** సేవలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో సేవాలాల్ సేన 9వ ఆవిర్భావ దినోత్సవ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ధరావత్ శంకర్ నాయక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్, సేవలాల్ సేన త్రిసభ్య కమిటీ సభ్యులు చినబాబు నాయక్ గారు, యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజారాం గారు, సేవాలాల్ సేన రాష్ట్ర గిరిజన సంస్కృతి కళా కారుడు డాక్టర్ ఎస్ పి నాయక్, మూడావత్ లక్ష్మణ్ నాయక్ పాల్గొని వారు మాట్లాడుతూ.. గిరిజన భాషకు లిపి ఏర్పాటు చేయాలని, గిరిజనుల జీవన విధానం అమలు చేయాలని, గిరిజనులకు ఇప్పటివరకు స్వాతంత్రం వచ్చి దాదాపుగా 76 సంవత్సరాల కాలం గడుస్తున్నా కూడా గిరిజనుల స్థితిగతులు మారలేదని అన్నారు. అలాగే గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలని, జనగామ జిల్లా కేంద్రంలో తెలంగాణ గిరిజన ముద్దుబిడ్డ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ టాను నాయక్ గారి విగ్రహన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని మాట్లాడారు. అలాగే ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



## ఝాన్సీ రెడ్డి పై బురద చల్లడం సరికాదు

**మాజీ పీఏసీఎస్ చైర్మన్ నిరంజన్ రెడ్డి**

**మహబూబాబాద్/తొర్రూరు, విశాల భారతి:** ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో దేవాలయాలను రాజకీయాల కోసం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వాడుకుంటున్నారని, హిందూ సంప్రదాయ పద్ధతులను తుంగలో తొక్కి దేవాలయాల పవిత్రతను మంట కలుపుతున్నాడని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూర్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్మిడిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మంత్రి ఎర్రబెల్లి రాజకీయ కార్యక్రమంగా మార్చారని, ప్రజలను, మహిళలను బలవంతంగా బస్సుల్లో తరలించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రామునికి ఎడమవైపున ఉండాల్సిన సీతమ్మ విగ్రహాన్ని కుడి వైపు పెట్టి ఆగమశాస్త్ర నిబంధనలను మంట గలపడమే కాక. అదే సరైన పద్ధతి అని సమర్థించుకునే ప్రయత్నం చేశాడన్నారు. వల్మిడిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగిన రోజు గ్రామంలో ఒకరు చనిపోయారని, ఊర్లో శవం ఉండగా విగ్రహ ప్రతిష్టాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. భద్రాద్రి ఆలయంలో రామునికి ఏ పక్కన సీతమ్మ ఉందని, దాన్ని ఎర్రబెల్లి గుర్తుకు రాలేదా అన్నారు. ధ్వజస్తంభం ఎంత బరువు ఉన్నదన్న దానిపై అంచనా లేకుండా ఎత్తడం వల్ల అది కూలిపోయిందని తెలిపారు. మీ నాయకుడు ఎర్రబెల్లికి ఇంగ్లీష్ వచ్చా అని ప్రశ్నించారు. 70 ఎకరాలు ప్రజాసేవకు ఝాన్సీ రెడ్డి కేటాయిస్తుందని మంత్రిగా ఉండి ఎర్రబెల్లి ఒక్క ఎకరమైన కేటాయించగా అని ప్రశ్నించారు. మచ్చలేని మా నాయకురాలు ఝాన్సీ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ అనుమండ్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పింగిలి ఉష, మహిళా మండల అధ్యక్షురాలు ప్రశాంతి, నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, కాందాడి అశోక్ రెడ్డి, మేకల కుమార్, ముద్రబోయిన వెంకన్న, సుంచు సంతోష్, బిక్షం గౌడ్, మనోహర్, వరప్రసాద్, శీలం హరిత, వెంకట్ రెడ్డి, దీకొండ మధు, రాయిపెల్లి రాజు, కుమారస్వామి, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 'గిరిజన బిడ్డను ఆశీర్వదించండి'



**తిరుమలాయపాలెం, విశాల భారతి :** పాలేరు నియోజకవర్గం బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన స్వాతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యే ఎన్నికలలో పోటీగా మీ ముందుకు వస్తున్నానని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఆశీర్వదించి నన్ను గెలిపించాలని గిరిజన నేత గుగులోత్ సురేష్ నాయక్ అన్నారు.వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు మంజూరు చేయించానని నియోజకవర్గంలో అన్ని మండలాల్లో విద్యార్థులకు న్యాయం చేశానని, వృద్ధులకు, వికలాంగులకు అర్హులైన వారికి ఆసరా పెన్షన్లు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషిచేసి ప్రభుత్వంతో పోరాటం చేసి పేద ప్రజలకు న్యాయం చేశానని, పోలీస్ అభ్యర్థుల నిరుద్యోగుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పోరాటం చేసి కోర్టు ద్వారా విజయం సాధించి పోలీస్ అభ్యర్థులకు న్యాయం చేశానని, గిరిజనులకు రిజర్వేషన్ల విషయంలో పోరాటం చేసి ఎన్నోసార్లు ప్రగతి భవన్ ముట్టడి చేశానని జిల్లాలోని అన్ని మండలాల విద్యార్థులకు వారి కళాశాలల నుంచి సర్టిఫికేట్లు ఇచ్చే విధంగా పోరాటం చేసి విద్యార్థులకు ఆసరాగా నిలిచాననీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాలలో పర్యటిస్తాననీ పేద ప్రజలకు చైతన్యం చేసీ వచ్చే సాధారణ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం స్వాతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తానని నన్ను అభిమానించే వారు, బంధువులు,మిత్రులు అణిచివేతకూ గురవుతున్న నా పేద సామాజిక వర్గానికి చెందిన ప్రజలు నన్ను ఆశీర్వదించాలనీ కోరారు.

# రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్ తోనే సాధ్యం

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



**మణుగూరు, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి యొక్క సీఎం కేసీఆర్ తోనే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శనివారం నాడు ప్రభుత్వ విప్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పినపాక కాంతారావు ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గం లోని బూర్గంపాడు, మణుగూరు మండలాలలో పర్యటించారు. ముందుగా బూర్గంపాడు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు, అనంతరం బాలికల హాస్టల్ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు . మణుగూరు మండలంలోని తోగ్గూడెం వద్ద నుంచి ఆర్టీసీ డిపో వరకు మంత్రి పువ్వాడ అజయ్ ను టిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో ఆహ్వానించారు. ముందుగా మండలంలో అర్బన్ పార్క్ మున్సిపాలిటీ భవనం, ఆర్టిసి బస్టాండ్, వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మండలంలోని కిన్నెర కల్యాణ మండపంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 100కు 100% అభివృద్ధి జరుగుతుందంటే దానికి కారణం సీఎం కేసీఆర్ అన్నారు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రం మొత్తం అందుతున్నాయని వారు తెలియజేశారు. ఎంతోమంది పేద కుటుంబాలలో విలువలు నింపింది సీఎం కేసీఆర్ అని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే టిఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని చెప్పారు. రాష్ట్రంలో కొన్ని దుష్ట శక్తులు తిరుగు తున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని భ్రమలో ఉండొద్దని ప్రజలను కోరారు. అలాగే పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక బుల్లెట్ లా దూసుకుపోతున్నాడని ఆయన దమ్మున్న నాయకుడని వచ్చే ఎన్నికల్లో రేగా కాంతారావుని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ వినీత్, డిఎస్పీలు వెంకటేష్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



## నేడు తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

**పాలకుర్తికి తమ్మినేని వీరభద్రం రాక**

**పాలకుర్తి, విశాల భారతి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మెకు కనకా రెడ్డి పిలుపునిచ్చారు శనివారం పాలకుర్తి నియోజకవర్గం లో వీరనారి రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్మారక భవనంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. నాడు దొరలు భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ విప్లవ రైతంగ సాయుధ పోరాట కేంద్రంగా పాలకుర్తి నిలిచిందని విస్నూర్ రామచంద్రారెడ్డి ఆగడాలను ఎదిరించి ఇక్కడ ప్రజలు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతబూని పోరాటాలు కొనసాగించారని ఆ పోరాటంలో చిట్యాల ఐలమ్మ ముందు వరుసలో ఉండి ప్రజలకు ధైర్యం చెప్పి దొర ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తన భూమిలో పండిన పంటను భూస్వాములు లాక్కొని వెళ్తుంటే ఎర్రజెండా చేత భూమి వారిని తరిమి కొట్టిన చరిత్ర చిట్యాల ఐలమ్మది అని కొనియాడారు. నేటి యువత చిట్యాల ఐలమ్మ చరిత్రను తెలుసుకొని వారి ఆశయాల కోసం ముందుకు సాగాలని కోరారు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10వ తేదీన పాలకుర్తి మండల కేంద్రం లోని చౌరస్తాలో ఐలమ్మ వర్ధంతి జరుగుతుందని వర్ధంతి సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలకుర్తికి వస్తున్నారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మదర్, లక్ష్మణ్ నరేష్ అశోకు తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్ధాలకు అలవాటు కావొద్దు

**జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన**

**జఫర్ గడ్, విశాల భారతి :** మండలంలోని ముగ్దుంతండా గ్రామంలో జాగృతి పోలీస్ కళా బృందం వారి ఆధ్వర్యంలో శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎవి రంగనాథ్ ఐపీఎస్ ఆదేశానుసారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా విద్య, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, సిసి కెమెరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అదే విధంగా యువకులు గుట్కా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు.అలాగే మూడ నమ్మకాల మీద మ్యాజిక్ షో ద్వారా,వృద్ధ తల్లితండ్రులను బాధ్యత చూసుకోవాలనే తదితర అంశాలపై పాటల ద్వారా అవగాహన ఇచ్చారు. అలాగే సైబర్ క్రైమ్ గురించి నాటిక ప్రదర్శన ద్వారా తెలియజేస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సిఐ శ్రీనివాస్,జఫర్గడ్ ఎస్సై ఎం. మహేందర్, స్థానిక సర్పంచ్ బానోత్ లక్ష్మిస్వామినాయక్, కళా బృందం ఇంచార్జి నాగమణి, పోలీస్ సిబ్బంది, కళా బృందం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఐక్య పోరాటాలతో 'ఎరుకల' సమస్యలు పరిష్కరించుకుందాం

**టీపీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్**

**మహబూబాబాద్/ తొర్రూరు , విశాల భారతి:** అనాదిగా అణచివేతకు గురవుతున్న ఎరుకల సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం( టీపీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్ అన్నారు. ఎరుకల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నడిగడ్డ శైలజ ఆధ్వర్యంలో ఎరుకల మహిళా రణభేరి సభ శనివారం డివిజన్ కేంద్రంలోని ఎల్ వై ఆర్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వెలికట్ట శివారు పాల కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. ఎరుకల మహిళా రణభేరి సభకు జిల్లా అధ్యక్షురాలు శైలజ అధ్యక్షత వహించగా బీసీ సంఘాల ప్రతినిధి అంబర్ పేట్ శంకర్ పైల్వాన్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. శ్యామలతో కూతాటి కుమార్ ప్రసంగించారు. తరాలుగా దోపిడీ, అణిచివేతకు ఎరుకల మహిళలు గురవుతున్నారని, స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లయినా ఎరుకల మహిళల బతుకులు నేటికీ మారలేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎరుకల మహిళల్లో నిరక్షరాస్యత రేటు ఎక్కువగా ఉందన్నారు. వారిని విద్య వైపు ప్రోత్సహించడంలో ప్రభుత్వాల కృషి నామ మాత్రమేనన్నారు. ఎరుకలు ప్రభుత్వ సహకారం లేక పోవడంతో,కులవృత్తులు, పందులను పెంచుకుంటూ, కూలీ పనులు, తదితర పనులు చేసుకుంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. గిరజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారే తప్ప వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎస్సి,ఎస్టీ కేసులను రాజకీయ నాయకులు అస్త్రంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఎరుకలను చైతన్యవంతులుగా చేసేందుకు గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తామన్నారు. పందుల పెంపకంతో జీవన ఉపాధి పొందే ఎరుకల మహిళలు ప్రభుత్వాల చర్యలతో వృత్తిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 7 లక్షల మంది ఆదివాసి, ఎరుకల సామాజిక వర్గ జనాభా ఉందని, జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించడం లేదని తెలిపారు.ఆర్థికంగా సామాజికంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న ఎరుకల మహిళలకు ప్రత్యేక పథకాలు అమలుచేసి ఆదుకోవాలని కోరారు. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి, ఉపాధ్యక్షులు రాయపురం శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోట ఎల్లేష్, ఉపాధ్యక్షుడు మాదగాని నరేష్, వీరేందర్, మహిళా నాయకులు శంకరమ్మ ఉపేంద్ర, నడిగడ్డ మానస, నడిగడ్డ నాగమణి, మాదగాని రమాదేవి, కవిత, నాయకులు తిరుపతి ఏసు, మానుపాటి సారంగం, మాదగాని వెంకన్న, నాగన్న రామచంద్రు, ఉపేందర్, పాపయ్య, వీరభద్రం, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.



## దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలె..

**తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డ యాదయ్య..**

**ముషీరాబాద్,విశాల భారతి:** దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గడ్డ యాదయ్య హాజరై మాట్లాడుతూ. గత రెండు సంవత్సరాలుగా దళిత బంధుపై రాష్ట్ర ప్రభుత్వం సీత కన్ను చూస్తుందన్నారు. దళితుల ఆర్థిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించి అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడంలో దళితులు ముందంజలో ఉంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎఫ్ జనరల్ సెక్రెటరీ నదానియల్, మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్, మహా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నర్సింగ్ రావు, బంధు సొసైటీ అధ్యక్షులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు అరెస్టను నిరసిస్తూ ఆందోళన

- చంద్రబాబుకు అరెస్టను నిరసిస్తూ ఆందోళన
- ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌ముందు నేతల బైఠాయింపు
- టీడీపీ లీడర్లను అరెస్ట్‌చేసిన పోలీసులు



**విశాల భారతి, హైదరాబాద్:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఏపీ ప్రభుత్వం అరెస్టు చేసిన నేపథ్యంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు, కేబీఆర్ పార్క్ కూడలినందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బంజారా హిల్స్ పోలీసులు టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే, కాట్రగడ్డ ప్రసూన, సామా భూపాల్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు జక్కిలి ఐలయ్య యాదవ్, గడ్డి పద్మావతి,బండారి వెంకటేష్ ముదిరాజ్, జివిజి నాయుడు,షేక్ ఆరీఫ్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులు ఎన్.దుర్గాప్రసాద్, సూర్యదేవర లత, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులు కనగాల సాంబశివరావు, పెద్దోజు రవీంద్రచారి,బిక్షపతి ముదిరాజ్, సంధ్యపోగు రాజశేఖర్, మందూరి సాంబశివరావు ,రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పొలంపల్లి అశోక్, లీగల్ రాష్ట్ర అధ్యక్షులు రఘువర్ధన్ ప్రతాప్,తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి,చేవెళ్లపార్లమెంట్ కమిటీ అధ్యక్షులు సుభాష్ యాదవ్, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్,తెలుగు మహిళానాయకులు ,ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి మాగంటి కిరణ్, రాష్ట్ర నాయకులు యానాల అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తి బీజేపీ అభ్యర్థిగా అవకాశమివ్వండి..

**దరఖాస్తు చేసుకున్న దుబ్బ రాజశేఖర్‌గౌడ్**

**దేవరుప్పుల, విశాల భారతి:** పాలకుర్తి అసెంబ్లీ అభ్యర్థిగా బిజెపి జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ దరఖాస్తు చేసుకున్నారు. శనివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాయకులతో కలిసి వెళ్లి దరఖాస్తు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించేది బీజేపీ మాత్రమేనని.. రాష్ట్రంలో,పాలకుర్తి నియోజకవర్గంలో ఈ రాజకార్ల పాలనకు ముగింపు పలకడం ఖాయమని.. నరేంద్ర మోడీ అభివృద్ధి పనులు పాలకుర్తి ప్రజల సంపూర్ణ మద్దతుతో పాలకుర్తిలో బిజెపి జెండా ఎగరేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పెద్దగొని రాజు,జిల్లా నాయకులు దుడల అరవింద్,దోమకొండ సంతోష్,సంగి రాజు,గొడిశాల రంజిత్,బబ్బురి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

**సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మధు**

**మణుగూరు, విశాల భారతి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక మరియు రాజకీయ విధానాలపై కార్మికులు ఏకకాలంలో పోరాటాలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు, ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు బండారు రమేష్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఐటియు శిక్షణా తరగతులలో వారు మాట్లాడారు మణుగూరులో గొల్డెన్ పంక్షన్ హాల్ నందు రెండురోజులపాటుజరిగే సి ఐ టి యు శిక్షణ తరగతులను ప్రారంభిస్తూ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు మాట్లాడారు కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలకు మూల కారణాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక రాజకీయ విధానాల్లోనే ఉన్నాయని అందుకనే ఆ విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఈ పోరాటాలను వివిధ వర్గాల ప్రజలు నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలతోటి మిళితం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్ర టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచడం కోసం ప్రైవేటీకరణ సరళీకరణ ప్రపంచీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయని వీటి పర్యవసానంగా దేశంలో కార్మిక వర్గం యొక్క హక్కుల పైన తీవ్రమైన దాడి జరుగుతుందని కార్మిక వర్గం నిజవేతనాలను కోల్పోతుందని ప్రభుత్వాలు వేస్తున్న ఆర్థిక భారాలకు కార్మిక వర్గం కుదేలవుతుందని పేర్కొన్నారు కార్మికుల నిర్మాత సిఐటియు వ్యవస్థాపక నాయకులు అమరజీవి పరస సత్యనారాయణ శతజయంతి ఉత్సవాలలో భాగంగా సంవత్సర కాలం పాటు సిఐటియులో పనిచేస్తున్న అన్ని స్థాయిల



నాయకులు కార్యకర్తలకు సిఐటియు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ఆర్థిక విధానాలు కార్మిక వర్గంపై చూపుతున్న ప్రభావాలు అనే అంశంపై ప్రముఖ ఆర్థిక రాజకీయ విశ్లేషకులు కార్మిక నాయకులు బండారు రమేష్ వివరించారు దేశ అభివృద్ధికి సమాజ ప్రగతికి ఉపయోగపడాల్సిన సహజ వనరులు మొత్తం కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతున్నాయని దీని ఫలితంగా భవిష్యత్తులో దేశం ఆర్థికంగా సామాజికంగా సాంస్కృతికంగా ఇతర దేశాలపై ఆధార పడవలసి వస్తుందని పేర్కొన్నారు సంపద సృష్టిస్తున్న శ్రామిక ప్రజలను మొక్కలు మొక్కలు చేసి పెట్టుబడుదారులు శ్రమ దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు ఆర్థిక విధానాల్లో వచ్చే ప్రతి మార్పు రాజకీయ విధానాల ఫలితమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అనేక రకాల స్కీములు పథకాలను సంస్థలను ఏర్పాటు చేసి ఎటువంటి చట్టబద్ధత లేకుండా శ్రమదోపిడి చేస్తున్నాయని వీటన్నిటి మూలం ఆర్థిక రాజకీయ విధానాల్లోనే ఉందని పేర్కొన్నారు పోరాటాల వైపు రాకుండా కార్మిక వర్గాన్ని కులం పేరుతో మతం పేరుతో వినోదం పేరుతో ముక్కలు చేస్తున్నారని పోరాటాల్లో పాల్గొనాలని చైతన్యాన్ని తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. సమస్యల పైన పోరాడే కార్మిక వర్గమే సమాజం మార్పు కోసం కూడా పోరాటాలు చేయాలని అందుకు రాజకీయాల్లో ప్రత్యక్షంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ రాజకీయ తరగతుల ప్రారంభ సూచికంగా సిఐటియు పతాకాన్ని సిఐటియు సీనియర్ నాయకురాలు రాజేశ్వరి ఆవిష్కరించారు అమరజీవి పరస సత్యనారాయణ గారి చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి పి మధు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ శిక్షణ తరగతులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్లు గద్దల శ్రీనివాస్ పిట్టల అర్జున్ ఈసం వెంకటమ్మ ఎస్‌ఎ నభి ధనలక్ష్మి దొడ్డ రవికుమార్ కే సత్య డి వీరన్న కెవిపిఎస్ జిల్లా నాయకులు రాములు సిఐటియు నాయకులు ఉప్పు తల నరసింహారావు ఈశ్వరరావు ప్రసాద్ నాగభూషణం సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మండల కా ర్యదర్శి జిల్లాలోని అన్ని మండలాల సిఐటియు ముఖ్యనాయకత్వం పెద్ద సంఖ్యలో శిక్షణా తరగతులకు హాజరయ్యారు.





ALL INDIA CONGRESS COMMITTEE

Publicity Committee

1. Shri Shabbir Ali - Chairman
2. Shri E.Anil kumar - Vice-Chairman
3. Shri Gaddam Vinod
4. Shri Suresh Shetkar
5. Shri G.Anil Kumar
6. Shri Kumar Rao
7. Shri Sangisetti Jagdeeshwar Rao
8. Shri Gadugu Gangadhar
9. Shri Manne Satish
10. Shri Naidu Satyanarayana Goud
11. Shri Vachan Kumar
12. Shri Madhusudan Gupta

## ఏఐసిసి పబ్లిక్ కమిటీ వైస్ చెర్మెన్ గా సురేష్ షెట్కార్

**నారాయణఖేడ్, విశాలభారతి:** ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ కమిటీ వైస్ చెర్మెన్ గా ఎన్నికైనా పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ కు నారాయణఖేడ్ నియోజికవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ పట్టణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించి 50 సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈ సంవత్సరం 51వ వసంతంలోకి వెళ్తున్న సందర్భంగా గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మలమంచి మోహన్ జోషి, స్థానిక మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, రామాలయం చైర్మన్ హనుమాన్లు, కౌన్సిలర్ వివేకానంద తెలిపారు. ఈనెల 16వ తేదీ నాడు శనివారం ఉదయం 11 గంటలకు సాయిబాబా ఫంక్షన్ హాల్ నందు నారాయణఖేడ్ గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని.. ఈ సమావేశానికి నారాయణ ఖేడ్ గణేష్ మండపాల వద్ద నిర్వహించి ఉత్సవ కమిటీలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కోదాడ బీజేపీ టికెట్ఇవ్వాలని నూకల పద్మారెడ్డి దరఖాస్తు

**మోతె, విశాల భారతి:** కోదాడ నియోజక వర్గ శాసన సభ కు పోటీ చేయడానికి బి జె పి అభ్యర్థిగా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన నూకల పద్మ రెడ్డి శనివారం హైద్రాబాద్ లోని రాష్ట్ర బి జె పి కార్యాలయం లో దరఖాస్తు చేసినట్లు పద్మ రెడ్డి ప్రకటనలో తెలిపారు. కోదాడ నియోజక వర్గం అభివృద్ధికి బాటలు వేసే విధంగా కృషి చేస్తానని నా పై నమ్మకం ఉంచి నాకు టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో నియోజక వర్గ నాయకులు మహిళలు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడు అంజయ్యకు ఘనంగా సన్మానం

**దేవరుప్పుల, విశాల భారతి:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మండల కేంద్రానికి చెందిన అంబటి అంజయ్య సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సెప్టెంబర్ 05వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రులచే గురుపూజోత్సవ దినోత్సవం సందర్భంగా అందించగా తన బాల్యమిత్రులు శుక్రవారం పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన బాల్య మిత్రులు మాట్లాడుతూ ఓనమాలు నేర్చుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చేలా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిట్ల వెంకటేశ్వర్లు నడిదె సీతారామిరెడ్డి నీలారపు వెంకన్న ఏల వీరాస్వామి రామచారీ బుర్ర ప్రభాకర్ నల్ల లక్ష్మీపతి ఉపాధ్యాయులు ఉమారాణి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



## గానుగుబండ గ్రామంలో హనుమంతుడి పూజలు

**తుంగతుర్తి, విశాల భారతి:** తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామంలో ప్రతి సంవత్సరం గ్రామంలో శ్రావణమాసంలో హనుమాన్ గుడిలో నుంచి ఆగండ జ్యోతి వెలిగించుకుంటూ అట్టి ఆగండాన్ని పెండ్లిగానే బ్రహ్మచారైన మగపిల్లలు ఆగండాన్ని జ్యోతి నీ పట్టుకొని 41రోజు నియమ నిబంధనలతో ఆగండి జ్యోతి నీ వెలిగిస్తూ భజన భక్తులు చిరుతలతో వాయించుకుంటూ భక్తి గేయాలు పాడుకుంటూ గ్రామంలో ప్రతి గడప గడప తిరుగుతూ నూనె పోస్తూ పూజలు చేస్తారు. శ్రావణమాసం ఆఖరి రోజు అయిన శనివారం రోజున సర్పంచి నల్లు రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నలుగు రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హనుమాన్ గుడిలో అఖండ జ్యోతి వెలిగిస్తూ గ్రామ ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తి మండల్ కమిటీ సభ్యులు విరబోయిన అమ్మయ్య,మట్టపల్లి వెంకన్న, జక్కుల లింగయ్య, మద్దెల నర్సయ్య,విరబోయిన లింగయ్య,బోయిని మల్లికార్జున, విరబోయిన మల్లయ్య,అబ్బగాని రవి, జటంగి సుధాకర్, జటంగి మహేష్ జటంగి అనిల్, వెలిశాల వెంకన్న, అక్కినపెల్లి మల్లేష్ భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన

**తిరుమలాయపాలెం, విశాల భారతి:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధిక ధరల, నిరుద్యోగ ఉపాధి కుదింపునకు వ్యతిరేకంగా దమ్మాయిగూడెం గ్రామ సీపీఎం శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల జోన్ కన్వీనర్ నాగటి సురేష్ మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, ఉపాధి పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బ్రతుకులు దురదృష్టంగా మారాయన్నారు. కుల, మత ఘర్షణలు దేశంలో తాండవిస్తున్నాయని దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనదని సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు నాగేశ్వరరావు, గ్రామ శాఖ కార్యదర్శి చామకూరి కోటయ్య, మండల నాయకులు బోడ పట్ల సతీష్ గౌడ్, వడ్డెబోయిన నగేష్ గౌడ్ పాల్గొన్నారు.



## బబ్బూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరికలు

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి 'ఎర్రబెల్లి'**

**దేవరుప్పుల, విశాల భారతి:** బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకులు ప్రముఖ సామాజికవేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలం,ధరావత్ తండా, ధర్మగడ్డ తండా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హైదరాబాదులోని మంత్రుల నివాసంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు.మంత్రి వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై కాంగ్రెస్ వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు.మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరికి చేర్చేల ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు.పార్టీలో కొత్త పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సుమచిత స్థానం గౌరవం ఉంటుందని అన్నారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేకించి అభినందించారు.కాంగ్రెస్ ను వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మూడ శంకర్. భూక్య యాకూబ్,భూక్య మంక్యా ,భూక్య యకన్న ,భూక్య సోమ్లు, సూరా రాపు యకన్న, మలోతు రాజు, బానోతు కబిర ,భూక్య శ్రీను , లగ్గోని ప్రవీణ్,భూక్య సోమన్న ,భూక్య సైదులు , మామిడి సైదులు,జోగు సందీప్ , లాకవత్ రాము,భూక్య రెడ్డి , మాలోతు సోమన్న, భూక్య సంతోష్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు. భూక్య శ్రీకాంత్ , బానోతురాహుల్ , హరి ,బలు నాయక్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల సమన్వయకర్త పల్ల సుందర్ రాంరెడ్డి , పిఎసిఎస్ డైరెక్టర్, కొత్త జలంధర్ రెడ్డి,సర్పంచ్ బానోత్ గేమా నాయక్ గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవా నాయక్, జనార్ధన్, మండల యువజన నాయకులు చంద్రగిరి సంపత్ గౌడ్, జోగు శ్రీశైలం, పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.



## నిరుపేద విద్యార్థినికి ఎమ్మెల్యే కిశోర్ చేయూత

**నూతనకల్, విశాల భారతి:** నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మొండికత్తి మల్లయ్య కుమార్తె ప్రవలిక ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజిలో సీటు పొందారు. కానీ చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిశోర్ కుమార్ సహాయం కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సహృదయంతో విద్యార్థికి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థిని మొండికత్తి ప్రవలిక ఎంబిబిఎస్ లో సిటు సాధించిన సందర్భంగా అభినందించి శాలువాతో సత్కరించి భవిష్యత్తులో మంచి డాక్టర్ గా పేరు సంపాదించాలని ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి కందాల దామోదర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య ఎర్రపహాడ్ ఎంపీటీసీ రజిత లింగరాజు యాదవ్ ,అంజయ్య, అనిల్ పాల్గొన్నారు.



## పేదలకు అండగా బబ్బూరి శ్రీకాంత్

**దేవరుప్పుల, విశాల భారతి:** ఇప్పటికే ఎన్నో పేద కుటుంబాలకు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు చేయూతను అందించిన పెద్దమడూరు గ్రామానికి చెందిన సామాజిక యువ నాయకుడు ప్రముఖ వ్యాపారవేత్త బారాసా పార్టీ జిల్లా యువజన నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ తన ఆప్యాయతను మరో మారు చాటుకున్నాడు. లింగాల గణపురం మండలంలోని నేలపోగుల గ్రామా నిరుపేద కుటుంబానికి చెందిన గుగ్గిళ్ల శోభ శ్రీను దంపతుల కూతురు శ్రీలత వివాహనికి శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం గ్రామ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శ్రీకాంత్ గౌడ్ అందించిన పుస్తె మట్టెలను వధువు తల్లిదండ్రులకు అందించారు..ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతుందని సంపాదించే దానిలో ఎంతోకొంత పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తమ కూతురి వివాహానికి అండగా ఉండి పుస్తె మట్టెలు అందజేసినందుకు వధువు తల్లిదండ్రులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతు కోఆర్డినేటర్ ఆకవరం పెద్దారెడ్డి మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి రాములు ఉప సర్పంచ్ మానుపాటి వెంకటేష్ శ్రీకాంత్ గౌడ్ యువసేన సభ్యులు చంద్రగిరి సంపత్ బోరేం నరేందర్ రెడ్డి మానుపాటి ఉపేందర్ గోరుపెల్లి సంపత్ రెడ్డి జోగు మహేందర్ జోగు శ్రీశైలం ఆకవరం రాజు వెంకన్న పాల్గొన్నారు.

## అంబులెన్స్ లోనే ప్రసవించిన మహిళ

**దేవరుప్పుల, విశాల భారతి:** మండలం,మాదాపురం గ్రామానికి చెందిన ఝాన్సీ (20) కి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది ఆమెను జనగామ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రలిస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి దీంతో అంబులెన్స్ లో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది.తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటి బిల్లా బాలరాజు పైలెట్ శ్రీనివాస్ తెలిపారు.అనంతరం తల్లి బిడ్డను జనగామ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు.కుటుంబ సభ్యులు పలువురు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.





## బీఆర్ఎస్ పార్టీ లోకి పలువురి చేరిక

నూతనకల్, విశాల భారతి : తిరుమలగిరిలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ నివాసంలో నుతనకల్ మండలపరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనికి చెందిన వివిద పార్టీల, సంఘాల ముఖ్యనాయకులు ,యువకులు ముల్కలపల్లి నగేష్ , ముల్కలపల్లి సైదులు, మంద గణేష్, మంద శేఖర్, మంద వంశీ, ముల్కలపల్లి గణేష్, మంద ముత్తయ్య, కంచనపల్లి మల్సూర్, ముల్కలపల్లి రవి, మంద రవి, కొమ్ము సురేష్, ముల్కలపల్లి శ్రీకాంత్, కొమ్ము వెంకన్న, కొమ్ము సుధీర్, ముల్కలపల్లి చంద్రయ్య, మంద నాగేష్ మంద రాములు, మొదలగు వారు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలకు ఆకర్షితులై శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి కందాళ దామోదర్ రెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య ,గ్రామశాఖ అధ్యక్షులు వేల్పుల లింగయ్య ,వార్డు సభ్యులు ,మండలపార్టీ నాయకులు బ్రాహ్మండ్లపల్లి యాకుబ్ చారి ,వార్డుసభ్యులు ముల్కలపల్లి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబుని అరెస్టు చేయడం కుట్రపూరిత చర్య

**బెల్లంపల్లి, విశాల భారతి:** బెల్లంపల్లి నియోజకవర్గం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నియోజకవర్గం అధ్యక్షుడు గద్దల నారాయణ, పట్టణ అధ్యక్షుడు మణిరాం సింగ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, పేదల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నారా చంద్రబాబు నాయుడు నంద్యాలలో బస చేస్తున్న సమయంలో పోలీసులు చుట్టు ముట్టి.. కుట్రపూరిత అరెస్ట్ లు చేయడం తగదని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి అసమర్థత ప్రభుత్వం ఏమి చాతకాక తమ నాయకుడిని అరెస్ట్ చేసారని మండి పడ్డారు. కిచక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పన్నాగం పన్ని స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తారని 2015 లో ఉన్న కేసును సీ.బీ సీ.ఐ.డి రుజువు చేసి పక్కన పెట్టిన కేసును మళ్ళీ తిరిగి విచారణ జరిపి అక్రమ అరెస్ట్ చేసారని అన్నారు. ఎన్నికలు రానున్న సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను అతలకుతలము చేద్దాం అనే ఉద్దేశ్యంతో ఈ పన్నాగం పన్నారని.. కోర్టుకు రెండు రోజుల సెలవు వస్తున్న వేళ జైలులో పెట్టాలనే ఈ అక్రమ అరెస్ట్ అని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని ప్రజలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, కేంద్రం స్పందించి కుట్రలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు గద్దల నారాయణ, పట్టణ అధ్యక్షుడు మణిరాం సింగ్, టి.ఎన్.టి.యు.సి జిల్లా నాయకుడు జీవరత్నం, టి.డి.పి పట్టణ ఉపాధ్యక్షుడు బోల్లు మల్లయ్య, సిరికొండ కనకయ్య, గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ఏఐకేఎంఎస్ నేత వెంకటేశ్వర్లు డిమాండ్**




**మహబుబాబాద్/ బయ్యారం, విశాల భారతి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం స్టేట్ ట్రెజరర్ నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఇచ్చిన పిలుపులో భాగంగా అఖిల భారత రైతు కూలీ సంఘం బయ్యారం మండల కార్యవర్గ సమావేశం శనివారం కస్తూరి నగరంలో మండల అధ్యక్షులు పూనం భిక్షమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చారిత్ర అత్మకమైన రైతాంగ పోరాటం ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగానికి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను రెండు సంవత్సరాలు కాస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కల్లబొల్లి కబుర్లతో కాలం వెళ్లవచ్చుతున్నాడని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని. రైతే దేశానికి వెన్నుముకని చెప్పిన ప్రధాని మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయన ఎద్దేవ చేశారు. మోడీ సర్కార్ కు చిత్తశుద్ధి నిజాయితీ ఉంటే ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని రైతాంగాన్ని కాపాడాలంటే వ్యవసాయ రంగానికి బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచాలని, విత్తనాలు, ఎరువులు, విద్యుత్. వ్యవసాయ పరికరాలకు, సబ్సిడీలు పెంచాలని, రైతులు పండించిన అన్ని రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర ఎం.ఎస్.పి కి చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యల నివారణ కు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని విమర్శించారు. ఇందుమూలంగానే రోజురోజుకు రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని దీనంతటికీ ప్రభుత్వాలే కారణమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలవలన కరువు వరదలు అనేక రకాల చీడపీడనల వలన పంటలు నష్టపోయిన రైతాంగానికి అందవలసిన ఫసల్ బీమా యోజన పథకాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా అమలుపరుస్తున్నారని అన్నారు. ఫసల్ బీమా యోజన పథకాన్ని సవరించి సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వై పరిత్యాలవలన పంటలు, పొలాలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు. అన్ని పంటలకు భీమా పథకాన్ని అమలు చేస్తూ రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కుటుంబాలను అప్పుల ఊబి నుండి విముక్తి చేయడానికి రుణ విముక్తి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సమగ్ర శాసన చట్టం తీసుకువచ్చి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కెసిఆర్ ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతాంగానికి తక్షణసాయంగా ఎకరాకు పదివేల రూపాయలు ఇస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పై డిమాండ్ల సాధన కోసం రైతాంగం ఐక్యంగా మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి తోకల వెంకన్న, చింత వెంకన్న, రామచంద్రుల మురళి, బానోతు హోలీ, చందు వీరన్న, ఆవిరనారాయణ, ఫుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ రోడ్లకు నిధులు మంజూరైన సందర్భంగా పూజలు

**మహబుబాబాద్/ కురవి, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం పరిధిలోని కంది కొండ గుట్ట కు బి.టి రోడ్డు మంజూరు అయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వర్యులు కెసిఆర్ గౌరవ మంత్రివర్యులు కేటీఆర్ రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్, కూరవి మండల జడ్పిటిసి బండి వెంకట్ రెడ్డి. బి.బి నాయక్ తండ గ్రామ సర్పంచ్ బోడ శ్రీను ఆధ్వర్యంలో కంది కొండ లక్ష్మి నరసింహ స్వామి వెంకటేశ్వర స్వామి ఎంతో చరిత్ర కలిగిన దేవాలయం కు అభివృద్ధి కొరకు కంది కొండ టి.ఓ లక్ష్మి నరసింహ స్వామి టెంపుల్, కంది కొండ ఈ.ఓ పీ.ఆర్ రోడ్డు టిఓ లచ్చ తండ వరకు మొత్తం 3.65 ముడు కోట్ల అరువై ఐదు లక్షల రూపాయల తో బి.టి రోడ్డు మంజూరు చేసినా మన మంత్రి సత్యవత్తి రాథోడ్ కి ఆ లక్ష్మి నరసింహ స్వామి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుతు ఈరోజు గుట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చెసిన బిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో బోడ రవీందర్, బోడ వెంకన్న, బానోతు సైదులు, బావుసింగ్, పాండు, హన్మంతు ,రాజు, విరన్న, శంకర్, ప్రశాంత్, సుమన్, సురేష్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు ఫండ్స్‌కేటాయింపు

**జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్**

**మహబూబాబాద్ / తొర్రూర్, విశాల భారతి :** జిల్లా పరిషత్ 2022-2023 ఫైనాన్షియల్ ఇయర్ స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ ఫండ్స్ నుంచి రూ. 18 లక్షలను వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు కేటాయించినట్లు జడ్పీటీసీ మంగళ పెల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణ అభివృద్ధి మరియు మంచినీటి సరఫరా విభాగం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనల మేరకు జిల్లా పరిషత్ నుండి స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నుంచి తొర్రూరు మండలానికి నిధులు విడుదల కాగా అందులో 5 లక్షలు వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మాణం చేయుటకు కేటాయించనైనది. రూ: 13 లక్షల రూపాయలతో మండలంలోని 10 గ్రామాల్లో ఐమాస్ జంక్షన్ లైటులను ఏర్పాటు చేయుటకు కేటాయించడమైనది. 1కర్కాల, 2,పెద్ద మంగ్య తండా, 3, టీక్యా తండా, 4అమర్ సింగ్ తండా, 5,చీకటాయపాలెం 6,చింతల పల్లి,7 కంటాయపాలం, 8, కొమ్మనపెల్లి, 9, గోపాల గిరి,10.దుబ్బ తండా గ్రామాల్లో ప్రధాన కూడల్లో లైట్లు ఏర్పాటు పనులను పర్యవేక్షించి దగ్గరుండి పూర్తి చేయించడం జరిగింది. చింతల పల్లి లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మల్లారెడ్డి మాజీ ఎంపిటిసి ఈనేపల్లి శ్రీను, పాక్స్ డైరెక్టర్ పాపిరెడ్డి , నాయకులు వెంకట్ రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ నుంచి బిజెపి టికెట్ కోసం సంగప్ప దరఖాస్తు



**నారాయణఖేడ్, విశాల భారతి:** బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి బిజెపి అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్లికేషన్ స్క్రీనింగ్ కమిటీ ఇంచార్జి ఇంద్రసేనారెడ్డికి తన అప్లికేషన్ ను ఇచ్చినట్లు సంగప్ప తెలిపారు.




## రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమం

**జూనియర్ సివిల్ జడ్జి రాచర్ల శాలిని**

**తుంగతుర్తి , విశాల భారతి :** లోక్ అదాలత్‌ను ఉపయోగించుకుని కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాచర్ల శాలిని అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దీని ద్వారా పరస్పర అవగాహనతో రాజీ పడడం వల్ల ఇద్దరు గెలిచినట్లేనని అన్నారు. ఈరోజు లోక్ అదాలత్ ద్వారా2966 కేసులు పరిష్కారమయ్యాయని అన్నారు. లోక్ అదాలత్ ను మండల న్యాయ సేవాధికార సంస్థ తుంగతుర్తి రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకు ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ప్రజలందరూ గొడవలు పడకుండా కలిసిమెలిసి ఉండడం ద్వారా నే సమాజంలో ప్రశాంత నెలకొల్పబడుతుందని మరియు సమాజ అభివృద్ధి జరుగుతుదని అన్నారు.. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గుగులోత్ రాజారాం ,బి ప్రతాప్, బార్ అధ్యక్షులు జిల్లా కుమారస్వామి న్యాయవాదులు న్యాయవాదులు వెంకటేశ్వర్లు రణధీర్ హరిచరణ్ చంద్రమౌళి సతీష్, పూల్సింగ్ నాయక్ నాగరాజు వజీర్ రవికుమార్ అనిల్ కుమార్ శ్రీనివాస్,మహేష్ న్యాయవాదులు సభ్యులు మరియు కోర్టు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ భవనానికి 5లక్షల మంజూరు

**బెల్లంపల్లి, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా తెలంగాణ రజక సంఘం సమితి జిల్లా అధ్యక్షుడు తంగాళ్ళపల్లి బాపు ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావును కలిసి.. జిల్లాలోని నస్పూర్ చాకలి ఐలమ్మ భవన నిర్మాణానికి నిధులు కావలని అడుగగా.. నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు మంజూరు చేశారని, సంఘం తరుపున ఎమ్మెల్యే దివాకర్ రావుకి, యువ నాయకులు విజిత్ రావుకి వారు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే నస్పూర్ లో చాకలి ఐలమ్మ భవన నిర్మాణం చేపడతానని తెలిపారు. తెలంగాణ రజక సంఘం సమితి జిల్లా ఉపాధ్యక్షుడు నగునూరి సారయ్య, ప్రచార కార్యదర్శి రాగల్ల రాజయ్య, మహేష్, కుమార్ లు పాల్గొన్నారు.



## కార్యకర్తకు భరోసా ఉన్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ

**ఆమనగల్లు, విశాల భారతి:** ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15, 12 వార్డు బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపల్ కన్వీనర్ పత్య నాయక్ సమక్షంలో దాదాపు 100మంది తెరాస కండువ కప్పుకున్నారు. అనంతరం పత్య నాయక్ మాట్లాడుతూ బిఆర్ఎస్ సంక్షేమ పథకాలే తెలంగాణ రాష్ట్రానికి శ్రీ రామ రక్ష అని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన ప్రతి నాయకున్ని, కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పూసల సత్యం, యూత్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయం

**తుంగతుర్తి బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసిన మల్లెపాక సాయి బాబా**



**తుంగతుర్తి, విశాల భారతి:** తెలంగాణలో కాషాయ జెండాఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నానని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో అనేక పోరాటాలు చేశానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో తెలంగాణ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు అధికారంలోకి వచ్చినంక అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు, నీళ్లు నిధులు నియామకాలు పేరుతో తెలంగాణ కోసం ఉద్యమిస్తే వాటిని కల్పించకుండా సీఎం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమే పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు తెలంగాణ ప్రభుత్వం వైపెల్లలంపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కష్టపడే వారికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. తుంగతుర్తి అసెంబ్లీ పార్టీ టికెట్ తనకే కేటాయిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బిజెపి తుంగతుర్తి మండల ఉపాధ్యక్షుడు కత్తుల నరేష్,రమేష్,నాగరాజు, మధు, శ్యామ్, లక్ష్మణ్, వెంకన్న, మహేష్, అశ్విన్, సాయికృష్ణ, నవీన్, రాంబాబు, సందీప్, నరేందర్, సురేష్, బాబు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 19 వరకు ఓటు సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అలా**

**మణుగూరు, విశాల భారతి :** పినపాక నియోజకవర్గం లోని అన్ని పోలింగ్ స్టేషన్‌లో సెప్టెంబర్ 19 లోపు ఓటు నమోదు ,తొలగింపు, బదిలీ మరియు సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా అన్నారు. శనివారం నాడు మణుగూరు లోని తాసిల్దార్ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ జిల్లా ఎస్పీ వినీత్తో కలిసి 110 పినపాక ఎస్టీ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ పై మరియు ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్లో వసతి సౌకర్యాలు ముఖ్యంగా కరెంటు మంచినీరు దివ్యాంగుల కొరకు ర్యాంప్ ఏర్పాట్లు అన్ని సౌకర్యాలు కరెక్ట్ గా ఉన్నది లేనిది పరిశీలించి నివేదికలు అందజేయాలని అన్నారు. అలాగే ఈ నెల 19 లోపు తప్పనిసరిగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటర్ నమోదు, తొలగింపు, బదిలీ మరియు సవరణలు కొరకు దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత బిఎల్వోలు చూడాలని, అట్టి క్లైమూలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అన్నారు. అదనపు పౌర సంబంధాలు అధికారి కార్యాలయము భద్రాచలం నుండి జారీ చేయడం అయినది అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో మంగీలాల్, ఏఈఆర్ఓ మరియు తాసిల్దార్ మణుగూరు రాఘవరెడ్డి ,ఆర్ ఐ లు తదితరులు పాల్గొన్నారు.



## సాంబాయిగూడెంలో కాళోజి జయంతి వేడుకలు

**మణుగూరు, విశాల భారతి :** మణుగూరు మండలంలోని సాంబాయి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో 2022- 2023 తెలుగు సబ్జెక్టు లో 100 శాతం ఉత్తీర్ణ 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు విష్ణు, చరణ్, సాద్విత, ఐశ్వర్య, భావన, దీపికలకు తమ తెలుగు ఉపాధ్యాయుడు తన సొంత ఖర్చులతో బహుమతులు అందజేశారు. అదేవిధంగా వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా మాలోత్ భద్రు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ సామాజియానికి విశేషమైన సేవలు అందించిన మహానీయుడు ఆయన కవిత్వంతో సాహితి సమరాన్ని పూరించి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు కాళోజి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపతమ్మ గ్రామ పెద్దలు పునుగుల రమేష్ భవాని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'ఎలియాస్‌రెడ్డి లోటు తీర్చలేనిది'



**మఠంపల్లి, విశాల భారతి :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాదె ఎలియాస్ రెడ్డి మృతి చాలా బాధాకరమని, ఆయన లోటు తీర్చలేనిదని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎలియాస్ రెడ్డి డెడ్‌బాడీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ యస్ పార్టీ జిల్లా నాయకులు గుండా బ్రహ్మ రెడ్డి, బి ఆర్ యస్ మండల పార్టీ అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ సభ్యులకు శుభాకాంక్షలు

**బీ జే పీ నియోజకవర్గ ఇంచార్జి కొయ్యల ఏమాజీ**

**బెల్లంపల్లి, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ సభ్యులకు కొయ్యల ఏమాజి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణలో పత్రికలు, మీడియా పాత్ర కీలకమని, ప్రజాస్వామ్య హక్కుల రక్షణకు పత్రికలు తోడ్పడాలని అన్నారు. అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేష్, కోశాధికారి రాజేష్, సభ్యులను అభినందించారు.

# బెల్లంపల్లిలో బిజెపిదే గెలుపు

**బిజెపి నేత కొయ్యల ఏమాజి**




**బెల్లంపల్లి, విశాల భారతి:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గం చిన్నయ్యను చిత్తుగా ఓడించాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బెల్లంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి కొయ్యల ఏమాజి నియోజక వర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. బెల్లంపల్లిలో స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎఎంసీ ప్రెస్ క్లబ్ లో మొదటి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మహిళల్ని లైంగికంగా వేధించారని, శేజల్ అనే అమ్మాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, పోలీసులకు విన్నవించినా ఎవరూ పట్టించకోవడం లేదన్నారు. అలాంటి వ్యక్తికి కెసిఆర్ ఎంఎల్ఏ టికెట్ ఇవ్వడం దుర్మార్గం అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన చిన్నయ్య ఒక్క హామీ నెరవేర్చ లేదన్నారు. ఆయనకు ఎందుకు ఓటు వేయాలో నిలదీయాలని కోరారు. బెల్లంపల్లిలో గెలుపు బిజెపిదేనని.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో బిజెపి తప్పకుండా గెలుస్తుందని కొయ్యల ఏమాజి తెలిపారు. 8వ తేదీన రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థిత్వం గురించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను గత ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసి ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాటం చేశానని, పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేశానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్, దూది ప్రకాష్, మోహన్, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గొమస కమల, శ్రావణ్ కుమార్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## జగన్ దిష్టిబొమ్మ దహనం

**ఆమనగల్లు, విశాల భారతి :** మాజీ సీఎం, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం ఆమనగల్లు పట్టణంలో ఏపీ సీఎం జగన్ దిష్టిబొమ్మను టిడిపి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు ముమ్మాటికి రాజకీయ కక్షే అని, ఎఫ్ఐఆర్ లో పేరు లేకుండా ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. ప్రశ్నించే గొంతుకను నొక్కడం వైకాపా చేతకానితనానికి నిదర్శనమని వారు విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి యాది లాల్, నాయకులు కాలే మల్లయ్య, కండె భాస్కర్, వెంకటేష్, జగన్, పెంటయ్య, కుమార్ గౌడ్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోడి రమేష్ దరఖాస్తు

**బెల్లంపల్లి, విశాల భారతి:** బెల్లంపల్లి నియోజకవర్గం నుండి తాను కూడా పోటీ చేసి గెలుస్తాను అని భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు కోడి రమేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గం నుండి నన్ను గెలిపిస్తే అభివృద్ధి పదంలో ముందు ఉంచటానికి కృషి చేస్తానని.. బెల్లంపల్లి ప్రజలు నన్ను ఎమ్మెల్యే గెలిపిస్తారు ఆ నమ్మకం వుంది అని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయుటకు భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో తన పేరును కూడా పరిశీలించాలని రాష్ట్ర పార్టీకి దరఖాస్తు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు కనక విజయ్, గడ్డం నరేష్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శంకర్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, పట్టణ ఉపాధ్యక్షులు మేకల రాజశేఖర్, మోటగరి రాజేష్, ముత్తునూరి నాగరాజు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు పీక లక్ష్మణ్, ఎస్సీ మోర్చా పట్టణ కార్యదర్శి గడ్డం చిన్ని కృష్ణ, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాసబోయిన యుగేందర్, ఉపాధ్యక్షులు బండారి అశోక్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, ప్రధాన కార్యదర్శి స్రవంతి, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు బొపెల్లి అజయ్, కార్యదర్శి జిమ్మిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం చిన్నయ్య భారి మెజారిటీతో గెలవాలని ప్రత్యేక పూజలు



**బెల్లంపల్లి, విశాల భారతి:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ముచ్చటగా మూడోసారి తమ నేతకాని ముద్దుబిడ్డ దుర్గం చిన్నయ్యను బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు, అలానే భారీ మెజారిటీతో గెలవాలని పవిత్రమైన శక్తి గల జ్యోతిర్లింగాలు శక్తి పీఠాన్ని మధ్యప్రదేశ్ లోని ఉజ్జయిని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం.. ఉజ్జయిని మహాకాళి శక్తిపీఠం.. ఓంకారేశ్వర జ్యోతిర్లింగలను బిఆరెస్ సీనియర్ నాయకులు గుమాస తిరుపతి, దుర్గం వంశీకృష్ణ, గుమాస శ్రావణ్ కుమార్, రత్నం ప్రశాంత్, రాజు దర్శించుకున్నారు. చిన్నయ్య పేరు మీద అభిషేకాలు చేసి భారీ మెజార్టీతో గెలవాలని.. ఆ పరమేశ్వరుని ప్రార్థించారు.

# హలో బహుజన - చలో కల్వకుర్తి

- నేడు బిఎస్పి ఆధ్వర్యంలో మెగా బైక్ ర్యాలీ
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**ఆమనగల్లు, విశాల భారతి:** కల్వకుర్తి నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ బలోపేతం కోసం నేడు మెగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. హలో బహుజన చలో కల్వకుర్తి ర్యాలీ కడ్తాల్ నుండి కల్వకుర్తి వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ ర్యాలీలో బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

**ఆమనగల్లు, విశాల భారతి:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తాండ శంకర్.. కొండ తండాల మధ్య ప్రధాన రహదారి కత్వ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో శనివారం ఆమనగల్లు పట్టణంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 3.10 కోట్ల రూపాయలు మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యంతో నేటికీ పనులు ప్రారంభించలేదని వారు ఆరోపించారు. వర్షాకాలంలో వాగు ఉధృతి పెరిగి రాకపోకలు నిలిచిపోయి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు లక్ష్మణ రావు, మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీకాంత్ సింగ్ , ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్స్ చెన్నకేశవులు, గోరటి నరసింహ , లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండె సాయి, మండల బీజేవైఎం అధ్యక్షులు శ్రీనివాస్, కల్వకుర్తి నియోజకవర్గం బీజేపీ పార్టీ మీడియా ఇంచార్జ్ రవి రాథోడ్, మున్సిపాలిటీ దళిత అధ్యక్షులు గిరి, గిరిజన మోర్చా మున్సిపాలిటీ అధ్యక్షులు రవీందర్, బీజేవైఎం సీనియర్ నాయకులు భాస్కర్, నందు, గోపాల్, చంద్రు గుంటూరు, మల్లయ్య, వరికుప్పల రాఘవేందర్, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం

**రూ. 10 వేలు అందించిన రామరాజు యాదవ్**



**నల్గొండ, విశాల భారతి:** నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన వల్కి క్రాంతి కుమార్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. శనివారం ఆర్కేఎస్‌ఫౌండేషన్ చైర్మన్‌పిల్లి రామరాజు యాదవ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం కుమార్ తల్లికి రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో చిమట లింగస్వామి, వల్కి సతీష్, శ్యామ్ కుమార్, వేణు, శశి, ఆకాష్, ఆర్కే ఎస్ టీమ్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## డోర్నకల్ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

**నర్సింహుల పేట జడ్పీటీసీ భూక్య సంగీత**

**దంతాలపల్లి, విశాల భారతి :** డోర్నకల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని నరసింహుల పేట జడ్పీటీసీ, బీజేపీ డోర్నకల్ నియోజకవర్గ నాయకురాలు భూక్య సంగీత కోరారు. శనివారం హైదరాబాద్ .. నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ తను రాజకీయంగా గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధిగా పనిచేస్తున్నానని ఒకసారి ఎంపీటీసీగా, రెండు సార్లు జడ్పీటీసీగా పనిచేశానన్నారు. డోర్నకల్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ప్రజాప్రతినిధిగా రాణిస్తున్నానని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాస కోల్పోయారని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు మార్పును కోరుతున్నారని, ఆ మార్పు బిజెపి పార్టీ ద్వారానే సిద్ధిస్తుందని విశ్వసిస్తున్నారని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో అధర్మ పాలన సాగుతుందని ఆ పాలన నుండి ప్రజలను విముక్తి చేయడం కోసం బిజెపి శాసన సభ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే బిజెపి జెండాను నియోజకవర్గం లో ఎగరవేయడం ఖాయమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.




## జాతీయ లోక్ అదాలత్ లో 2331 కేసులు పరిష్కారం

**- సివిల్ జడ్జి కాటం స్వరూప**

**ఆమనగల్లు, విశాల భారతి :** కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలని జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప సూచించారు. శనివారం ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇద్దరు కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారు.. రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు.. అనే నినాదంతో నిర్వహించిన మెగా లోక్ అదాలత్ విజయవంతమైంది. పోలీస్ స్టేషన్లలో నమోదై, రాజీకి వీలున్న కేసులను, జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా ఆమనగల్లు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో 2331 కేసులు పరిష్కారం అయ్యాయి. అందులో 2207 ఈ- పెట్టీ కేసులు, 124 ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి స్వరూప మాట్లాడుతూ. . చిన్న పొరపాటు, క్షణికావేశం కారణంగా గొడవలు, మనస్పర్థలు పెట్టుకొని కేసులు దాకా వెళ్ళి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే అవుతుందని అన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని చిన్న చిన్న తగాదాలకు కోర్టులను ఆశ్రయించిన వారు లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకుని రాజీ పడి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు దుడ్డు ఆంజనేయులు, ఎపిపి కార్తీక్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, న్యాయవాదులు మల్లేపల్లి మధు, జగన్, రామకృష్ణ, వస్పుల మల్లేష్, మధు, గణేష్, జగన్, సంతోష్, ఆంజనేయులు అమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన సునీల్

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. హాసకొత్తూర్ గ్రామానికి చెందిన రాకేష్ కు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల కొరకు 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఏనుగు నర్సింలు, దేశాయ్ ముత్తెన్న కూడా ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అనంతరం భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కొండా ప్రకాష్ గౌడ్ ద్వాదశ దినకర్మలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునీశ్వరుని జాతరలో ఎమ్మెల్యే 'చిరుమర్తి' పూజలు



**రామన్నపేట, విశాల భారతి :** రామన్న పేట మండలం మునిపంపుల గ్రామంలో మునీశ్వరుడి జాతర సందర్భంగా గ్రామానికి వచ్చిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆలయంలో పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, సర్పంచ్ యాదాసు కవిత, కడమంచి సంధ్య, ఎంపీటీసీలు గాదె పారిజాత, గొరిగె నరసింహ, ఎండీ అమీర్ తదితరులు పాల్గొన్నారు



## చిరస్మరణీయుడు అక్కెనపల్లి వాసుదేవరావు

**తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్కే చాంద్**

**రామన్నపేట, విశాల భారతి :** సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమ ఫోరం జేఏసీ మాజీ మండల కన్వీనర్ అక్కెన పెల్లి వాసుదేవరావు సేవలు చిరస్మరణీయమని తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్కే చాంద్, తెలంగాణ ఉద్యమ నాయకుడు గొలుసుల ప్రసాద్ అన్నారు. శనివారం రామన్నపేట పట్టణంలో సుభాష్ సెంటర్ లో వాసుదేవరావు ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్కే చాంద్, ప్రసాద్ మాట్లాడుతూ రామన్నపేట పట్టణంలో కోర్టు ఏర్పడిన నాటి నుంచి తొలితరం న్యాయవాదిగా వాసుదేవరావు ఎన్నో సేవలందించారన్నారు. ఆయన సేవా తత్వం మూర్తీభవించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఆయన రామన్నపేటకు చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపెల్లి లింగయ్య, సాల్వేర్ ప్రవీణ్ కుమార్, కోట సుధాకర్, ఉదయ్, ఎండీ అజార్, ఏనుతుల రమేష్ ఎండీ యాకూబ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేశ్



**మహబుబాబాద్, విశాల భారతి:** బీఎస్పీ కార్మిక విభాగం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన గుజ్జునూరి నరేష్‌ను నియమించినట్లు బీఎస్పీ కార్మిక విభాగం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఐనాల పరశురాములు తెలిపారు. ఈ సందర్భంగా ఐనాల పరశురాములు మాట్లాడుతూ బిఎస్పీ కేవి నిరంతరం కార్మికుల పట్ల నిలబడి తమ హక్కుల సాధనకోసం పోరాటం చేస్తుందని అన్నారు. జిల్లా నిర్మాణం లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని స్థాయిలలో పూర్తి కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. బిఎస్పీ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జునూరి నరేష్ మాట్లాడుతూ కార్మిక రంగా సమస్యల పరిష్కారం కోసం అందరిని కలుపుకొని నిరంతరం ఉద్యమిస్తానని అన్నారు. నా నియామకానికి సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ సముదాయ భవనంలో కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ భీమ్‌గల్ ఆధ్వర్యంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 109వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి గట్టు ఈశ్వర్ మాట్లాడుతూ.. నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని జాగృత పరిచిన తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సోమిడి దేవదాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆరే రమేష్, ఉప సర్పంచ్ కే.సుమన్, వాక శివప్రసాద్, తీగల నారాయణ, వహీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## జాబ్ మేళాకు అనూహ్య స్పందన

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో అపోలో ఫార్మసీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. భీమ్‌గల్, హైదరాబాద్ అపోలో ఫార్మసీ స్టోర్స్ లో పని చేయుటకు జాబ్ మేళా నిర్వహించారు. దాదాపు 60 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం అపోలో కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ మేళా నిర్వహించిన నలంద డిగ్రీ కళాశాల యాజమాన్యనికి, అపోలో ఫార్మసీ కంపెనీకి పలువురు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.





# ఉమ్మెడలో కొత్త రాతియుగం ఆనవాళ్ళు

- **ఖగోళ భావనలను తెలిపే రాతిబొద్దులున్న ఉమ్మెడ**
- **చరిత్ర పూర్వయుగ సంస్కృతికి నిదర్శనం**

**ఆర్మూర్, విశాల భారతి:**
తెలంగాణ చరిత్ర బృందం కటకం మురళి, బలగం రామ్మోహన్, మంత్రి శ్రీనివాస్, పరిశోధకుల ఆధ్వర్యంలో నందిపేట మండలం ఉమ్మెడలో కొత్త రాతియుగం, పెదరాతియుగం నాటి పురాతన ఆనవాళ్ళను గుర్తించారు. 6వేల యేండ్లనాటి కొత్తరాతియుగం రాతిపనిముట్లను పదును పెట్టుకున్న నూరుడుగుంటలను(గ్రోవేస్), నాలుగున్నర వేల సం.రాల నాటి పెదరాతియుగంనాటి ఖగోళభావనలను తెలిపే రాతిబొద్దుల సముదాయాన్ని (కుపులేస్, కప్మర్క్) పరిశోధకులు అన్వేషించారు. ఉమ్మెడలోని కాలభైరవస్వామి గుట్ట చుట్టు ఎన్నో రాతిగుండ్లు, సహజసిద్ధమైన రాళ్ళపేర్పుతో ఏర్పడ్డ గుహలున్నాయి. పరుపు బండరాళ్లున్నాయి. ఒక పరుపుబండమీద 23 రాతిబొద్దు (కుపులేస్)లున్నాయి. వీటి అమరిక నక్షత్రరాశిని సూచించే విధంగా వుంది. చరిత్రకారుడు కెపిరావు ఇవి 4వేల సంవత్సరాల కిందటి బృహచ్ఛిలాయుగానివిగా భావిస్తున్నానన్నారు. ఇవి ఉమ్మెడలో వేలయేండ్లుగా మానవావాసాలుండేవని చెప్పడానికి నిదర్శనాలు. వీటితో పాటు ఇక్కడ అంతులేని ముడి, చక్రపు పెట్రోగ్లిఫ్ లు లభించాయి. వీరి వెంట సర్పంచ్ రాముడ పోశెట్టి, యువజన సంఘం బాధ్యులు బుచ్చ సాయారెడ్డి, కాసుగంటి బొర్రా ముతెన్న తదితరులు ఉన్నారు.

## తుంగతుర్తి అభివృద్ధి ప్రధాత గాదరి కిశోర్

- **బీఆర్ఎస్ లీడర్**
- **గుండగాని శ్రీనివాస్ గౌడ్**



**తుంగతుర్తి, విశాల భారతి:** ఆంధ్ర వలస పాలకుల నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గం అగ్రస్థానంలో నిల్పడానికి నిరంతరం కృషి చేస్తున్న విద్యార్థి ఉద్యమ నాయకుడు డాక్టర్ గాదర్ కిశోర్ కుమార్ అని తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుండగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడు దశాబ్దాల ఉమ్మడి రాష్ట్ర పాలనలో ధ్వంసం అయిన తెలంగాణకు తిరిగి కేవలం 9 సంవత్సరాల లోనే అపూర్వంగా తీర్చిదిద్దిన ఘనత కేసిఆర్ ది అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పూర్వం తుంగతుర్తి నియోజకవర్గం బీడు భూములతో హత్య రాజకీయాలతో రక్తపుటేరులా ప్రవేశిస్తూ ఉండేది అన్నారు. నియోజకవర్గ ప్రజలు నీటి వసతి లేక పంటలు పండించలేని దినపు స్థితిలో కోర్టు కేసులు చుట్టు తిరగలేక వలస వెళ్లేవారు నేడు హరితహారం పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్, మిషినీ కాకతీయ, మిషన్ భగీరథ,రైతుబంధు, రైతు బీమా,కేసీఆర్ కిట్టు,దళిత బంధు, బీసీ బందు, గృహలక్ష్మి లాంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధి పథంలో నిలిచిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే నియోజకవర్గం ప్రజలకు దొరకడం నియోజకవర్గం ప్రజలు అదృష్టమని తెలిపారు. గానుగుబండ గ్రామానికి రెండుసార్లు ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు జిల్లా స్థాయిలో సామాజిక న్యాయంగా సురక్షిత గ్రామం అనే కేటగిరిలో ప్రథమ స్థానములు ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. గానుగుబండ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు అని తెలిపారు.

# అభివృద్ధిని చూసి ఓటేయండి

**సర్పంచ్ల ఫోరం మండలం ఉపాధ్యక్షురాలు సుశీల**



**సైదాపూర్, విశాల భారతి:** మండలంలోని సోమారం గ్రామంలో సర్పంచ్ల ఫోరం మండల ఉపాధ్యక్షురాలు, సర్పంచ్ సుశీల తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓటెయ్యండి అంటూ సంక్షేమంతో పాటు అభివృద్ధికీ తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మండలాభివృద్ధి కోసం కోట్ల రూపాయల వెచ్చించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించిన ఘనత నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు దక్కుతుందని అన్నారు. అభివృద్ధి ఫలాలను అందరికీ అందించాలన్నది మా ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల సామాజిక, వ్యక్తిగత సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 9 సంవత్సరాల కాలంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత బిఆర్ఎస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. గ్రామ గ్రామాన ప్రజలంతా ప్రభుత్వం నుండి అందిన లబ్ధిని తెలియజేస్తూ మరోమారు బిఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే సతీష్ కుమార్ మూడవసారి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పెరమాండ్ల సురేష్ గౌడ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ పైడిమల్ల తిరుపతి గౌడ్, పాకాల రమేష్, కాశపాక సదానంద, కుమార్ రాజు శ్రీనివాస్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతికి బోనాల పండగ ప్రతీక

**ఆమనగల్లు, విశాల భారతి:** కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో ఈ నెల శ్రావణమాసంలో జరిగే గ్రామదేవత పోచమ్మ, మైసమ్మ, వివిధ కుల దేవతల బోనాల మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి అన్నారు. గ్రామంలో ఈ నెల 9న కాటమయ్య బోనాలు, 10న కుల దేవతలైన పెద్దమ్మ, బీరప్ప, ఈదమ్మ, ఈదమ్మ మాడెల్ స్వామి వార్ల బోనాలు. 11న గ్రామ దేవతైన పోచమ్మతల్లి బోనాలు,12న రేణుక ఎల్లమ్మ బోనాలు జరగనున్నట్లు తెలిపారు. శనివారం గ్రామంలో వివిధ దేవాలయాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నాలుగు రోజులపాటు గ్రామంలో జరిగే బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని, దేవాలయాల దగ్గర పారిశుధ్య నిర్వహణలోఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయితీ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోనాలు తెలంగాణ సంస్కృతికి సంప్రదాయానికి ప్రతీకలని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటే ప్రధాన పండగల్లో ఒకటైన బోనాల ఉత్సవాలు రాజకీయాలకతీతంగా, అందరము కలిసికట్టుగా జరుపుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో నిర్వహించే పోచమ్మ బోనాల ఏర్పాట్ల కోసం తనవంతుగా పోచమ్మ దేవాలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.1,00,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సత్యం యాదవ్, నిర్వాహక సభ్యులు చేగురి రాములు, మాలే మల్లేష్ గౌడ్, రాంచందర్ నాయక్, కేశని యాదయ్య, ముద నరసింహ, బోసు రవి, తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు నాయుడు అరెస్ట్ అప్రజాస్వామికం

**టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సైదేశ్వర రావు**

**కోదాడ, విశాల భారతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై ఏపీ ప్రభుత్వం కక్షపూరిత కేసులు పెట్టి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ లో టీడీపీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు ఏపీలో వైయస్ జగన్ పాలన పరాకాష్టకు చేరిందని ప్రజలకు ఏమి చేయలేక ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ సైకోల వ్యవహరిస్తున్నారని అరెస్టులతో తెదేపా కార్యకర్తలు ఎవరు భయపడారాని సుదీర్ఘకాలం రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబును అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకులు తొండపు సతీష్, నంబూరి సూర్యం, రైతు సంఘం ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరావు, మండల అధ్యక్షులు చాపల శ్రీను, పిట్టల శోభన్ బాబు, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు ఉప్పగండ్ల శ్రీనివాసరావు, కొండ సోమయ్య గౌడ్, రేవంత్ రెడ్డి, ముంద్రా రవి, ఏటుకూరి సురేష్, కొత్త రాంబాబు, గుల్లపల్లి రమేష్, కోదాటి గురవయ్య, గుంటుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నల్గొండ ఎమ్మెల్యే టికెట్‌కోసం శ్రీనివాస్ గౌడ్ దరఖాస్తు

**నల్గొండ, విశాల భారతి :** బీజేపీ నల్గొండ ఎమ్మెల్యే టికెట్‌కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సీనియర్‌నేత మాదగోని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. నల్గొండ పార్లమెంట్‌కన్వీనర్ బండారు ప్రసాద్‌తో కలిసి బీజేపీ నేత దాసరి మల్లేశం దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు.

## నకిరేకల్‌బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

**– దరఖాస్తు చేసుకున్న బీజేపీ నేత నకరికంటి మొగులయ్య**



**రామన్నపేట, విశాల భారతి :**
రామన్నపేట పట్టణానికి చెందిన నకరికంటి మొగులయ్య నకిరేకల్ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. శనివారం జిల్లా, మండల నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేశానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధనంజయ, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, సీఎన్‌రెడ్డి , అసెంబ్లీ కో కన్వీనర్ తాడూరి ప్రభాకర్ , జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారన్నారు.



## అంగన్వాడి సెంటర్లో అక్షరాభ్యాసం

**సర్పంచ్ తోంట కాంతమ్మ**

**సైదాపూర్, విశాల భారతి:** మండలంలోని జాగిరి పల్లి అంగన్వాడీ కేంద్రంలో పోశాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ తొంట కాంతమ్మ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను సాధారణ,తక్కువ బరువు, తీవ్రమైన పోషకాహార లోపం, మితమైన తీవ్రమైన పోషకాహార లోపం, కుంగిపోయిన వారి స్థితిని పొందేందుకు వారి ఎత్తు, బరువు ప్రాముఖ్యత గురించి మహిళలకు సాధికారత కల్పించారు. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తొంట ఓదెలు, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి,అంగన్వాడీ కార్యకర్త రామా, ఉప సర్పంచ్ శంకర్, ఏఎన్ఎం రాజమ్మ,గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన జంటకు కౌన్సిలర్ ఆర్థిక సాయం

**భువనగిరి టౌన్,విశాల భారతి :** భువనగిరి పట్టణంలోని స్థానిక 7వ వార్డు హనుమాన్ వాడ లో మోర నర్సింగ రావు కూతురి వివాహం అయినందున వారి కుమార్తెకు వార్డు కౌన్సిలర్ దిడ్డికాడి భగత్ వారి సొంత రూ.10,000 లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నబోయిన ఆంజనేయులు వార్డు అధ్యక్షులు నరాల రమేష్ వార్డు సెక్రటరీ శదిడ్డికాడి శీను , వార్డు ఇంచార్జ్ జగదీష్ చారి, పిట్టల శేఖర్ యాట గణేష్ శమణికంఠ , వార్డు ప్రజలుపాల్గొన్నారు.

## దసరా క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఇంటర్ విద్యాధికారి



**ధర్పల్లి, విశాల భారతి:** తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు అయిన సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ "చేతులమీదుగా దసరా క్యాలెండర "ఆవిష్కరణ జరిగిందని జిల్లా అధ్యక్షుడు మామిడి విట్టల్ తెలియజేసారు. ఈ సందర్భంగా మామిడి విట్టల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న అధ్యాపకులందరి శ్రేయస్సే లక్ష్యంగా, రెగ్యులర్ కాని అధ్యాపకులందరిని రెగ్యులర్ అయ్యేంతవరకు అహర్నిశలు మా సంఘం తరపున పోరాడతామని తెలియజేశారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణకు సహకరించిన ఇంటర్ విద్యాధికారికి అధ్యాపకుల బృందం నుండి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పార్లమెంటులో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

**పాల్వాయి బాలయ్య మాదిగ డిమాండ్**

**తుంగతుర్తి, విశాల భారతి :** ప్రధాన పార్టీలు అన్నీ నిర్లక్ష్యాన్ని వీడి ఎస్సీ వర్గీకరణకు పూర్తి మద్దతు తెలిపి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి పాల్వాయి బాలయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జి తూరుగంటి అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాలయ్య మాదిగ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కొరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక ఉద్యమాల పితామహుడు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాలక పార్టీలతో పాటు ప్రతిపక్షాలు కూడా ఎస్సీ వర్గీకరణ కోసం ఒత్తిడి తీసుకురావాలని ఎస్సీ వర్గీకరణ అనేది సామాజిక న్యాయమని చెప్పి అనేకమార్లు మాట్లాడిన ప్రతిపక్షాలు మౌనం వహించడం మాదిగ మాదిగ ఉపకులాలకు ద్రోహం చేసినట్టేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక పార్లమెంటులో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించే విధంగా ప్రతిపక్షాలు అదే తరుణంలో ఇచ్చిన మాట కేంద్రం ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కో ఇన్చార్జి కందుకూరు శ్రీను మాదిగ, తుంగతుర్తి మండల ఇంచార్జి కొండగడుపుల శ్రీను మాదిగ, తుంగతుర్తి సీనియర్ నాయకులు పోలెపాక అంజయ్య , అర్వపల్లి ఇన్చార్జి చెడుపాక గంగరాజు, శాలిగౌరారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర రాములు మాదిగ, శాలిగౌరారం మండల్ నాయకులు ఎమ్మార్పీఎస్ కొండేటి సైదులు మాదిగ,తుంగతుర్తి టౌన్ అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ భాను ప్రకాష్ మాదిగ, తిరుమలగిరి సీనియర్ నాయకులు కందుకూరు చంద్రయ్య, కందుకూరు యాదగిరి, నూతనకల్ ఇన్చార్జి పాల్వాయి పరశురాం మాదిగ, నకిరకంటి మధు, గంగా దారి లక్ష్మీకాంత్, రావులపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల తరుణ్ పాల్గొన్నారు.

## ఈ నెల 11న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**ఆమనగల్లు, విశాల భారతి:** ఈనెల 11న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కడ్తాలలోని బటర్ఫ్లై క్లబ్ హౌస్ లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, పిఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్. మల్లయ్య ఎస్జిటి పిల్లిగుంట తండా, ఎస్ భీముడు పిఈటి జడ్పిహెచ్ఎస్ ముద్విన్, ఎస్. బాల్లేశ్వరరావు ఎస్ ఏ జెడ్పిహెచ్ఎస్ రావిచెడు, ఎస్. భార్గవి, ఎస్ ఏ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ఆమనగల్, ఎస్. వెంకటయ్య ఎంపీపీఎస్ ఆమనగల్, డి. పద్మప్రియ, హెచ్పిటి యుపిఎస్ పోలేపల్లి, ఎస్. నరసింహమూర్తి, ఎస్జీటీ ఎంపీపీఎస్ చంద్రధన, బి. శంకర్ ఎస్ ఏ జెడ్పి హెచ్ఎస్ పడకల్, బి. సురేష్ కుమార్ రెడ్డి ఎస్జీటీ ఎంపీపీఎస్ దేవుని పడకల్ , జి. రవికుమార్ ఎస్ ఏ జెడ్ పి హెచ్ ఎస్ వెల్దండ, టీ. గోపాల్ ఎస్ జి టి యుపిఎస్ అజిలాపూర్, ఎస్. కవిత ఎస్జిటి యుపిఎస్ చంద్రాయన్ పల్లి, జి. సుజాత హెచ్ పి టి జడ్పీహెచ్ఎస్ ఇర్విన్, ఏ. వెంకటయ్య ఎస్ ఏ యుపిఎస్ అన్నే బోయిన్పల్లి, కే. శ్రీనివాసులు ఎస్ ఎ జెడ్ పి హెచ్ ఎస్ మాడుగుల, ఆర్. నిర్మల పిఈటి జడ్పిహెచ్ఎస్ మార్చాల, ఏం. గోపాల్ ఎస్ఏ జెడ్పిహెచ్ఎస్ బాలుర కల్వకుర్తి, అబ్దుల్. సుభాన్ ఎస్ జి టి ఎంపీపీఎస్ ఎంగంపల్లి, ఎండి. జిలాని ఎస్ఏ హిందీ ప్రగతి స్కూల్ కడ్తాల్, బి. మాధవి హెచ్ పిటి బటర్ఫ్లై స్కూల్ కడ్తాల, బి. లిల్లి పుష్ప ఎస్జిటి పి ఎస్ కలకొండ, సర్దార్ నాయక్, ఎంఈఓ ఆమనగల్ కడ్తాల్ లను, సన్మానిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్సిఐఎఫ్, కోఆర్డినేటర్ జి. చెన్న కిషన్ రెడ్డి, ప్రధానవక్త రిటైర్డ్ ఆర్జెడి లక్ష్మారెడ్డి హాజరవుతున్నట్లు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, క్లబ్ పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులందరూ విధిగా హాజరు కావాలని పాష తెలిపారు.

# గ్రాండ్‌గా వాసవి సరోవర్ వేడుక



## హెచ్ఐసీసీ వేదికగా సందడి చేసిన వాసవి గ్రూప్
## వాసవి సరోవర్ ప్రాజెక్టు లాంచింగ్‌తో ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో వాసవి గ్రూప్ ప్రత్యేక గుర్తింపు ఉంది. 30ఏళ్ల అనుభవంలో పదుల సంఖ్యలో ప్రాజెక్టులను చేపడతూ తనదైన ముద్ర వేస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో నాలుగు భారీ ప్రాజెక్టులను ఆవిష్కరించిన వాసవి గ్రూప్... మరో సరికొత్త ప్రాజెక్టుతో కొనుగోలుదారుల సొంతింటి కలలను సాకారం చేయడంలో కృషి చేస్తోంది. అల్ట్రా మోడ్రన్ లేక్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును చేపట్టింది. నగరంలో రెండు ప్రధాన కేంద్రాలైన ఐటీ కారిడార్, కూకట్‌పల్లికి మధ్యలో వాసవి సరోవర్ పేరిట ఆవిష్కరించింది. విశాలమైన నిర్మాణ శైలి, కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మహానగరంలో పర్యావరణాన్ని ఆస్వాదించేలా చిన్న మైసమ్మ చెరువు సమీపంలో సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో 30 అంతస్తులతో లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును వాసవి సరోవర్ పేరుతో మార్కెట్లోకి తీసుకువస్తోంది.

హైటెక్ సిటీ నడిబొడ్డున 22 ఎకరాల లేక్ వ్యూ కాన్సెప్ట్‌తో వాసవి సరోవర్ వెంచర్‌ను కంపెనీ సీఎండీ యెర్రం విజయ్ కుమార్, బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ ఆవిష్కరించారు. 11 టవర్లతో 100కు పైగా సౌకర్యాలను అందిస్తుండగా, 2530 యూనిట్లతోపాటు, 85 స్కై విల్లాలు, 74 అపార్టుమెంట్ విల్లాలతో 2026 నాటికి ప్రాజెక్టును హ్యాండోవర్ చేయనుంది. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో క్లబ్ హౌజ్‌లూ, వినోదం, క్రీడా సౌకర్యాలు, జాగింగ్, స్పోర్ట్స్ కోర్టులు వంటి మెరుగైన మౌలిక వసతులు ఉండేలా ప్రాజెక్టును చేపడుతున్నారు. ఇప్పటివరకు 30కిపైగా రెసిడెన్షియల్, 17 కమర్షియల్ ప్రాజెక్టులను చేపట్టిన వాసవి గ్రూప్ గడిచిన ఏడాదిన్నర కాలంలో వాసవి అర్బన్, క్రౌన్ ఈస్ట్, వాసవి ఆనంద నిలయం పేరుతో మూడు హైరైజ్ ప్రాజెక్టులను నగరం చుట్టూరా ప్రారంభించింది. తాజాగా ఈ ప్రాజెక్టుతో నగరం నలువైపులా వాసవి వెంచర్లు నిర్మించిన ఘనతను సొంతం చేసుకున్నది.

**అట్టహాసంగా వాసవి సరోవర్ ఆవిష్కరణ**

భారీ ప్రాజెక్టులను చేపట్టడంతోనే... వాటిని మార్కెట్లోకి ఆవిష్కరించడంలో వాసవి తనదైన ముద్రను వేసింది. హెచ్ఐసీసీ ప్రాంగణంలో చేపట్టిన వాసవి సరోవర్ ప్రాజెక్టు ఆవిష్కరణ అట్టహాసంగా నిర్వహించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన కస్టమర్లు, కొత్త కొనుగోలుదారుల నడుమ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసవి కస్టమర్లు, యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక నృత్య గీతాలు, లోగో లాంచింగ్ వినూత్నం నిర్వహించారు.



### వాసవి బ్రాండ్ అంబాసిడర్‌గా విక్టరీ వెంకటేష్

30ఏళ్లుగా నిర్మాణ రంగంలో రాజీలేకుండా విస్తరిస్తున్న వాసవి గ్రూప్‌నకు టాలీవుడ్ నటుడు విక్టరీ వెంకటేష్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. ఇకపై వాసవి చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు ఆయన ప్రచారకర్తగా వ్యవహరించనున్నట్లుగా హెచ్ఐసీసీలో జరిగిన సరోవర్ లాంచింగ్ వేదికపై సీఎండీ విజయ్ కుమార్ వెల్లడించారు. కస్టమర్ల విశ్వాసంతో రియల్ ఎస్టేట్ వ్యాపార విస్తరిస్తున్న తమ సంస్థకు వెంకటేష్ బ్రాండ్ అంబాసిడర్ కావడం మరింత మందికి చేరువయ్యేందుకు సహకరిస్తుందని పేర్కొన్నారు.



### ఆధునిక జీవనానికి నాంది సరోవర్


ఇప్పటివరకు చేపట్టిన ప్రాజెక్టులకు వచ్చిన కొనుగోలుదారుల ఆదరణతో నగరవ్యాప్తంగా కొత్త వెంచర్లను ప్రారంభిస్తున్నాం. ఆధునిక జీవన విధానానికి నాంది పలికేలా వాసవి సరోవర్ ప్రాజెక్టును మరోసారి కస్టమర్ల ముందుకు తీసుకువస్తున్నాం. లేక్ వ్యూ కాన్సెప్ట్‌తో ఏకో ఫ్రెండీ జీవనశైలిని ఆస్వాదించాలని కోరుకునే వారికి అనువుగా నిర్మాణ శైలి ది. ఈ ప్రాజెక్టులో డబుల్, త్రిబుల్ బెడ్రూం ఇండ్లతోపాటు, అపార్టుమెంట్, స్కై విల్లాలు కూడా అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన ప్రాజెక్టులను అందించేలా, 75శాతం ఓపెన్ స్పేస్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు అన్ని ప్రాజెక్టుల కంటే ఎంతో భిన్నమైనది. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన లేక్ అడాప్టేషన్‌లో భాగంగా మూడు చెరువులను సంరక్షిస్తూ నివాసితులకు మెరుగైన సౌలతులను అందించేలా ఆధునీకరిస్తూనే.. ఈ చిన్న మైసమ్మ చెరువు సమీపంలో సరోవర్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చాం. - యెర్రం విజయ్ కుమార్, సీఎండీ, వాసవి గ్రూప్



### 30ఏళ్లలో నగరం నలువైపులా వాసవి ప్రాజెక్టులు

రియల్ ఎస్టేట్ రంగంలో 30 ఏళ్ల అనుభవంతో నగరం నలువైపులా ప్రాజెక్టులను కలిగి ఉన్న సంస్థగా వాసవి గ్రూప్ నగరంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. నిర్మాణంలో నాణ్యత, వైవిధ్యమైన ప్రాంతాలను ఎంపిక చేసుకుంటూ కస్టమర్లకు కొత్త అనుభూతినిచ్చేలా సొంతింటి కలలను సాకారం చేస్తున్నాం. ఇప్పటివరకు చేపట్టిన ప్రాజెక్టులకు కస్టమర్లు అందించిన ప్రోత్సాహంతో వచ్చే ఐదేళ్లలో 50 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టనున్నాం. ఇప్పటివరకు చేపట్టిన అన్ని ప్రాజెక్టుల కంటే ఎంతో వైవిధ్యమైనది, నగరానికి నడి మధ్యన పర్యావరణహితమైన ప్రాజెక్టుగా వాసవి సరోవర్ నిర్మాణం జరుగుతుంది.

- సౌమ్య చందా, డైరెక్టర్, వాసవి గ్రూప్




### 11 టవర్లతో మోడ్రన్ శైలికి అనుగుణంగా...

నూతన ఒరవడి, వినూత్న సాంకేతికతను అందిపుచ్చుకొని నిర్మాణ రంగంలో వాసవి గ్రూప్ ప్రత్యేక గుర్తింపును పొందుతుంది. 30ఏళ్ల వాసవి గ్రూప్ ప్రయాణంలో... చేపట్టిన ప్రాజెక్టులన్నింటిని ప్రత్యేక నిర్మాణ శైలితో నిర్మించిన ఘనత వాసవి సొంతం చేసుకున్నది. 22 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన సరోవర్ ప్రాజెక్టు కూడా ఆధునిక జీవనాన్ని అనువుగానే ఉంటుంది. 30 అంతస్తులు ఉండే 11 భారీ టవర్లతో ఈ ప్రాజెక్టును చేపడుతుండగా... గ్లోబల్ సిటీకి అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరాన్ని ప్రతీకగా నిలవనుంది. రానున్న రోజుల్లో వైవిధ్యమైన ప్రాజెక్టులను చేపడుతూ... నిర్మాణ రంగంలో వాసవి విప్లవాత్మక మార్పులతో ప్రాజెక్టులను కస్టమర్లకు అందించనున్నాం.

- అభిషేక్ చందా, డైరెక్టర్, వాసవి గ్రూప్



# 'రేరా'స్త్రంతో ప్రాజెక్టులు వేగవంతం

రేరాతో రియల్ ప్రాజెక్టులలో అవకతవకలు, అక్రమాలకు చెక్

కొనుగోలుదారులకు భరోసానిచ్చేలా మారిన రేరా యాక్టు

వేగంగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టుల నిర్మాణం

## అనరాక్ అధ్యయనంలో వెల్లడి.




**విశాలభారతి, హైదరాబాద్ :**

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ... రేరాగా పిలిచే ఈ యాక్టు రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనే ఓ గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని క్రమబద్ధీకరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రేరా యాక్టు వలన దేశంలో ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేందుకు సహకరిస్తోంది. ఒకప్పుడు గుర్గావ్, ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో చోటుచేసుకున్న రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కొనుగోలుదారులకు రక్షణ కల్పిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే రియల్ వ్యాపారాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు కొలమానంగా మారుతోంది. కొనుగోలుదారుల లక్షల రూపాయలు వసూలు చేసి చేతులెత్తేసే రియల్ ఎస్టేట్ సంస్థల అవినీతి బాగోతాలు క్రమంగా అదుపులోకి వస్తున్నాయి. రేరా అమలు తర్వాత కస్టమర్ల సొమ్ముకు భరోసా దొరకడమే కాకుండా... ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తున్నారు. అగ్రిమెంట్‌లో పేర్కొన్నట్లుగా కస్టమర్లకు ప్రాజెక్టులను అందిస్తున్నారని వెల్లడైంది. దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో చోటుచేసుకున్న మార్పులను ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో రేరా తర్వాత నిర్మాణ రంగంలో మరింత పారదర్శకత వచ్చిందని తేలింది.

ప్రాజెక్టుల్లో జాప్యం, లేదంటే నిధుల దుర్వినియోగంతో ప్రాజెక్టులను అర్ధాంతరంగా నిలిపివేయడం, డబ్బులు కట్టిన కస్టమర్లను వేధింపులకు గురిచేయడం వంటి ఎన్నో మోసాలు రియల్ ఎస్టేట్ రంగంలో ఇప్పటికీ జరుగుతున్నాయి. కానీ ఒక్కసారి రేరాలో రిజిస్టర్ అయిన ప్రాజెక్టుల తీరును గమనిస్తే... వేగంగా నిర్మాణ పనులు జరగడంతోపాటు, నిబంధనలకు అనుగుణంగా కస్టమర్ల చేతికి ప్రాజెక్టులు వస్తున్నట్లుగా తేలింది. హౌజింగ్ ప్రాజెక్టులను అర్ధాంతరంగా నిలిపివేయకుండా అడ్డుకోవడం, కొనుగోలుదారులను రక్షించడమే ప్రధాన లక్ష్యంగా రేరా అమలులోకి వచ్చిన యాక్టు క్రమంగా ప్రభావం చూపుతుంది. 2017 నుంచి దేశవ్యాప్తంగా ఈ యాక్టు అమలైన నేపథ్యంలో గడిచిన ఐదేళ్లలో 86శాతం హౌజింగ్ ప్రాజెక్టులు పూర్తి అయినట్లుగా అనరాక్ గుర్తించింది.

**సంక్షోభంలోనూ ఆగని రియల్ రంగం...**

దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం రెండు భారీ సంక్షోభాలను ఎదుర్కొంది. ఒకటి యూరప్ దేశాల యుద్ధ ప్రభావం, రెండోది కరోనా రూపంలో వచ్చినవి ఈ రెండింటి వలన ఐటీ, ఐటీయేతర రంగాలతోపాటు మాన్యుఫాక్చరింగ్ వాటిపై ప్రభావం చూపాయి. కానీ రియల్ ఎస్టేట్ రంగానికి అనూహ్యరీతిలో సహకరించింది. దేశవ్యాప్తంగా క్రయవిక్రయాలు ఏమాత్రం ఆగిపోకుండా రెండు సంక్షోభాలను తట్టుకుని నిలబడ్డాయి. హైదరాబాద్ నగరంలోనైతే... సాధారణ రోజుల కంటే కరోనా పీరియడ్‌లో అమ్మకాలు భారీగా పుంజుకున్నాయని, ముఖ్యంగా సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అంది వచ్చిన అవకాశంగా కొనుగోలుదారులు భావించారు. దీంతో మార్కెట్లో అప్పటికే ఉన్న ఇన్వెంటరీలో 28శాతం మేర కొనుగోళ్లు జరిగాయి. రేరా అమలు తర్వాత హౌజింగ్ ప్రాజెక్టులను సకాలంలో డెలివరీ చేయడం ఆనవాయితీగా మారింది. 2017 ద్వితీయార్ధం, 2018లో పూర్తి స్థాయిలో దేశంలోని ప్రధాన 7 నగరాల్లో ప్రారంభించబడిన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లలో కనీసం 86 శాతం ఇప్పుడు పూర్తయ్యాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అనరాక్ నివేదిక తెలిపింది.

**రేరాతో మరెన్నో ప్రయోజనాలు...**

రేరా యాక్టును అధికారులు పకడ్బందీ అమలు చేయగలిగితే... రెసిడెన్షియల్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడంతోపాటు..... నిర్మాణ రంగంలో తరుచుగా వినిపించే ప్రీ సేల్స్ వంటి గ్యారెంటీ లేని అమ్మకాలు కట్టడి అవుతాయి. దీంతో వినియోగదారుడి కష్టార్జితం నష్టపోకుండా ఉంటుందని ఈ అధ్యయనం ద్వారా తేలింది. ముఖ్యంగా నిబంధనలు అతిక్రమించే బిల్డర్లు, డెవపలర్ల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తూనే, రేరా నమోదిత ప్రాజెక్టులకు మాత్రమే క్రయవిక్రయాలు జరిపేలా తెలంగాణలోనూ చర్యలు తీసుకుంటే మరిన్ని ప్రయోజనాలు కొనుగొలుదారులకు దక్కుతాయి.

### హైదరాబాద్‌లోనూ వేగంగా నిర్మాణం...

2017 సెకండాఫ్ నుంచి 2018 పూర్తయ్యేంత వరకు ఏడు నగరాల్లో 1,642 రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లు రేరాలో నమోదు కాగా, కోవిడ్ వంటి సంక్షోభంలోనూ 1,409 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఏడాదిన్నర కాలంలో అత్యధిక ప్రాజెక్ట్‌లను చెన్నయ్ పూర్తి చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో ముంబై, చెన్నయ్, పుణే, బెంగుళూరు నగరాలు నిలిచాయి. చెన్నయ్‌లో ఏడాదిన్నర కాలంలో మొత్తం 119 ప్రాజెక్టులలో 107 నిర్మాణం పూర్తి అయ్యాయి. నాలుగో స్థానంలో హైదరాబాద్ నిలిచినప్పటికీ... గతం కంటే వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసినట్లుగా వెల్లడైంది. ఈ అధ్యయనంలో 74శాతం మేర ప్రాజెక్టులు సంపూర్ణంగా బిల్డర్లు నిర్మించారు. ఇందులో ఎక్కువగా రెసిడెన్షియల్ ప్రాజెక్టులే ఉండగా, బడా టౌన్ షిప్‌లు, కమర్షియల్ ప్రాజెక్టులు ఉన్నట్లుగా అనరాక్ పేర్కొంది. అయితే చివరి స్థానంలో కోల్‌కతా అత్యల్పంగా 70 శాతం ఉన్నట్లు అనరాక్ సంస్థ వెల్లడించింది. ఆ రాష్ట్రంలో రేరా అమలు చేయకపోవడంతోనే ప్రాజెక్టులు మందగించడానికి కారణమని తెలిపింది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్ (రెరా) అమలు తర్వాత హైదరాబాద్‌లో ప్రారంభించిన హౌజింగ్ ప్రాజెక్టులలో మొత్తం 110 ప్రాజెక్ట్‌లలో, మొత్తం 81 విజయవంతంగా కస్టమర్లకు అందినట్లుగా తేలింది.

**RERA- ప్రాజెక్ట్ పూర్తి రేటు**

| | |
|---|---|
| చెన్నయ్: | 90% |
| పుణే: | 89% |
| ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం: | 89% |
| బెంగుళూరు: | 85% |
| హైదరాబాద్: | 74% |
| కోల్‌కతా : | 70% |




## గోపీచంద్32 సినిమా గ్రాండ్ గా ప్రారంభం

'మాచో స్టార్' గోపీచంద్ హీరోగా శ్రీనువైట్ల కొత్త దర్శకత్వంలో చిత్రాలయం స్టూడియోస్ ప్రొడక్షన్ నెం.1 ను ఈరోజు అనౌన్స్ చేశారు. మాస్, ఫ్యామిలీస్ ని సమానంగా మెప్పించే యాక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లను రాయడంలో, తీయడంలో సిద్ధహస్తుడైన శ్రీను వైట్ల, గోపీచంద్ ను ఇంతకు ముందు చేయని పూర్తి భిన్నమైన పాత్రలో చూపించడానికి ఒక హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించ నున్నారు. సినిమా నిర్మాణం పట్ల ప్యాషన్ ఉన్న వేణు దోనేపూడి ప్రముఖ తారాగణం, భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లను రూపొందించేందుకు సూపర్‌స్టార్ కృష్ణ ఆశీస్సులతో కొత్త ప్రొడక్షన్ బ్యానర్ చిత్రాలయం స్టూడియోస్‌ను ప్రారంభించారు. #గోపీచంద్ 32 ప్రొడక్షన్ హౌస్ నుండి వస్తున్న మొదటి సినిమా. సినిమాలోని చాలా భాగం విదేశాల్లోని కొన్ని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించనున్నారు. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా రూపొందనున్న #గోపీచంద్ 32 ఈరోజు పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచ్ అయింది. ముహూర్తం షాట్‌కు మైత్రి నవీన్ కెమెరా స్విచాన్ చేయగా, లెజెండరీ దర్శకుడు కె రాఘవేంద్రరావు క్లాప్ కొట్టారు. శ్రీను వైట్ల స్వయంగా తొలి షాట్‌కి దర్శకత్వం వహించారు. రమేష్ ప్రసాద్, ఆదిశేషగిరిరావు, సురేష్ బాబు, మరికొందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలో ప్రారంభం కానుంది.

## మెగాస్టార్ తో రకుల్?

మెగాస్టార్ చిరంజీవికి హీరోయిన్లు సెట్ అవ్వడం ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తమన్నా..కాజల్ అగర్వాల్..నయనతార లాంటి భామలు నటించడంతో మళ్లీ వాళ్లని రిపీట్ చేయలేని పరిస్థితి. కొత్త హీరోయిన్ తీసుకుంటే చిరంజీవికి వయసుకు మ్యాచ్ అవ్వడం కష్టం అవుతుంది. ఫాంలో ఉన్న ఏ భామని తీసుకురావలన్నా వయసు అడ్డంకిగా మారుతుంది. మరికొంత మంది హీరోయిన్లు ఆ యవసున్న హీరోలకు చెల్లెళ్లుగానూ నటించడంతో! వెంటనే వాళ్లని ఎంపకి చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో 156..157 చిత్రాల్లో హీరోయిన్లగా ఎవరు ఎంపిక అవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. 157వ సినిమాకి సంబంధించి అనుష్క..నయనతారని పరిశీలిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే లోపు వాళ్లిద్దరిలో ఎవరో ఒకర్ని లాక్ చేసే అవకాశం ఉంది. మరి 156వ సినిమాలో హీరోయిన్ పరిస్థితి ఏంటి? అంటే తాజాగా ఈ విషయం వెలుగులోకి వస్తుంది. ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అన్నది ఇంకా నిర్మాతలు ప్రకటించలేదు. స్వయంగా చిరంజీవి పెద్దకు మార్తె సుస్మిత ఈ చిత్రాన్ని నిర్మించడంతో ఆమె అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మెగాస్టార కి జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ ని రంగంలోకి దించే ఆలోచనలో రామ్ చరణ్ ఉన్నట్లు తెలిసింది. రకుల్ ఇప్పటికే తెలుగులో చాలా సినిమాలు చేసింది. వెల్ నోన్ పేస్. సీనియర్ భామలకు సరితూగే భామే. చరణ్ కి మంచి స్నేహితురాలు. గతంలో తని ఒరువన్ రీమేక్ లో నటించింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతుంది.



## ఆదికేశవ నుంచి మొదటి పాట విడుదల

జాతీయ అవార్డు గెలుచుకున్న 'ఉప్పెన' చిత్రంతో తెరంగేట్రం చేసిన పంజా వైష్ణవ్ తేజ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన 'ఆదికేశవ' అనే యాక్షన్ చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. యువ సంచలనం శ్రీలీల ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. అపర్ణా దాస్, జోజు జార్జ్ ఈ చిత్రంతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. నవంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రముఖ స్వరకర్త, జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుండి 'సిత్తరాల సిత్రావతి' అంటూ సాగే మొదటి పాటను తాజాగా విడుదల చేసింది చిత్ర బృందం. నాయకానాయికల మధ్య సాగే మెలోడీ పాట ఇది. కథానాయకుడు వైష్ణవ్ తేజ్ తన చిత్ర(కథానాయిక శ్రీలీల)ను 'సిత్తరాల సిత్రావతి' అని పిలుస్తూ, ఆమె అందాన్ని పొగుడుతూ పాడే గీతంగా వినిపిస్తుంది, కనిపిస్తుంది. గేయ రచయిత సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి, అందమైన పదాల అమరికతో పాటకు ప్రాణం పోశారు.



## గం..గం..గణేశా ఫస్ట్ లుక్ రిలీజ్

"బేబీ" సినిమాతో రీసెంట్ గా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో ఆనంద్ దేవరకొండ. ఆయన ప్రస్తుతం "గం..గం..గణేశా" అనే కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఇప్పటిదాకా తను చేయని యాక్షన్ జానర్ లో ఆనంద్ ఈ సినిమా చేస్తున్నారు. "గం..గం..గణేశా" సినిమాను హై-లైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న"గం..గం..గణేశా" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఇవాళ ఆనంద్ దేవరకొండ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా రిలీజ్ చేశారు. పోస్టర్ లో రెండు రైఫిల్స్ పట్టుకున్నఆనంద్ దేవరకొండ కనిపిస్తున్నారు. పోస్టర్ బ్యాక్ గ్రౌండ్ లో గన్స్ పట్టుకున్న గ్యాంగ్స్, బాంబ్ బ్లాస్టింగ్ సీన్స్ కనిపిస్తున్నాయి. రాజావారి పల్లి అనే బోర్డు మీద రన్ - ఫన్ - గన్ అనే క్యాప్షన్ రాసి ఉంది. మొత్తంగా ఫస్ట్ లుక్ పోస్టర్ మూవీ మీద ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. "గం..గం..గణేశా" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ షేర్ చేస్తూ ఇది యాక్షన్ మూవీనా ?, కామెడీ మూవీనా ? ..త్వరలో మనం తెలుసుకుందాం. మరిన్ని డీటెయిల్స్, ఎగ్జైటింగ్ అప్ డేట్స్ రాబోతున్నాయి. అని క్యాప్షన్ రాశారు.





## హీటెక్కిస్తున్న అలియా

యూత్ లో మంచి క్రేజ్ ఉన్నా గ్లామర్ పాత్రల కన్నా వైవిధ్యమైన పాత్రలు పోషించి తన కెరీర్‌ను కొత్తదారిలో తీసుకెళ్లింది బాలీవుడ్ భామ అలియా భట్. ఆర్ఆర్ఆర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ ముద్దుగుమ్మ.. రీసెంట్ గానే తల్లై మాతృత్వపు మాధుర్యాన్ని కూడా ఆస్వాదిస్తోంది. అయితే ఇప్పడు ఆమెకు హాట్ వీడియోస్ నెట్టింట్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అవి చూసిన నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. అలియా భట్.. తల్లయ్యాకా నటించిన చిత్రాల్లో రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ ఒకటి. రణ్‌వీర్ సింగ్ తో కలిసి ఈ చిత్రంలో నటించింది. ఈ ఏడాది జులైలో రిలీజైన ఈ రొమాంటిక్ కామెడీ ఫ్యామిలీ డ్రామా.. బాక్సాఫీసు వద్ద మంచి హిట్‌గా నిలిచింది. రూ. 300కోట్ల రూపాయలు వరకు వసూలు చేసింది. అలాగే ప్రతిష్ఠాత్మకమైన బుసాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శితం కానున్న సినిమాల జాబితాలో నిలిచింది. ! ప్రముఖ నిర్మాత, నటుడు, దర్శకుడు కరణ్ జోహార్.. చాలా కాలం తర్వాత మెగా ఫోన్ పట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సీనియర్ నటులు ధర్మేంద్ర, జయా బచ్చన్, షబానా అజ్మీ ఇతర కీలక పాత్రలు పోషించారు. అయితే ఈ చిత్రంలో అలియా స్మోకింగ్, కొన్ని హాట్ సీన్స్ లో నటించింది. ఇప్పడీ సినిమా అమెజాన్ ప్రైమ్ లో సైలంట్ గా వచ్చేసింది. మంచి రెస్పాన్స్ కూడా వస్తోంది. ఈ క్రమంలోనే సినిమలోని అలియా గ్లామర్ బాగా ఫోకస్ అయింది. అందరీ దృష్టిని ఆకర్షించింది. ఎందుకంటే సినిమాలోని అలియాకు సంబంధించిన స్మోకింగ్, హాట్ అండ్ రొమాంటిక్ సీన్స్ నెట్టింట్లో బాగా వైరల్ గా మారాయి. ఇది చూసిన నెటిజన్లు, అలియా అభిమానులు షాక్ అవుతున్నారు. పెళ్లితో పాటు తల్లైన అలియా.. ఇలాంటి సన్నివేశాల్లో నటిస్తుందని వారంతా ఊహించుకోకలేకపోయారు. అదే సమయంలో అలియా ఎంతో అందంగా సూపర్ హాట్ గా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, అలియా భట్.. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డుకు ఎంపికైన సంగతి తెలిసిందే. గంగూబాయి కాఠియావాడి సినిమాలోని నటనకుగాను ఆమెకు ఈ పురస్కారం దక్కింది. అలాగే ఆమె ఇటీవలే హార్ట్ స్టోన్ అనే ఓ హాలీవుడ్ సినిమాతోనూ అభిమానులను పలకరించింది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి.

## 11న పెదకాపు1 థియేట్రికల్ ట్రైలర్



యంగ్ ట్యాలెంటెడ్ విరాట్ కర్ణ హీరోగా సెన్సిబుల్ డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు 1' విడుదల తేదీ సమీపిస్తోంది. 'అఖండ'తో బ్లాక్‌బస్టర్‌ను అందించిన ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫస్ట్ సింగిల్ మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానం లో ఉండటంతో మ్యూజిక్ ప్రమోషన్‌లు చార్ట్‌బస్టర్ నోట్‌లో ప్రారంభమైయ్యాయి, టీజర్ మంచి అంచనాలను నెలకొల్పింది. ఇప్పుడు, మేకర్స్ ఈ చిత్రం ట్రైలర్ డేట్ కి సంబంధించిన అప్‌డేట్‌తో వచ్చారు. ట్రైలర్ సెప్టెంబర్ 11న విడుదల కానుంది. అనౌన్స్‌మెంట్ వీడియోలో సినిమాలోని కోర్ పాయింట్‌ను తెలియజేసేలా దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఓ వీడియోను విడుదల చేశారు. పెద కాపు 1 అణచివేత, ఘర్షణల నేపథ్యంలో సాగే సినిమా అని టీజర్ ద్వారా తెలుస్తోంది. ట్రైలర్‌లో సినిమాకు సంబంధించిన మరిన్ని విషయాలు తెలియనున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.